

ఆదివారం

30 ఏప్రిల్, 2023

# వార్త

# సాంకేతిక వల

## వరమా! శాపమా!

# రామ్‌చరణ్ జోడీగా జాన్వీకపూర్?



**అందాల** నటి శ్రీదేవి కూతురు జాన్వీకపూర్ బాలీవుడ్‌లో హీరోయిన్‌గా నిలదొక్కుకునే ప్రయత్నంలో ఉంది. అదే సమయంలో టాలీవుడ్‌లోనూ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమైంది. కొరటాల శివ దర్శకత్వంలో జూనియర్ ఎన్టీఆర్ సరసన హీరోయిన్‌గా ఆమె టాలీవుడ్‌కు పరిచయం కానుంది. ఈ సినిమా సెట్స్‌పై ఉండగానే జాన్వీకపూర్ టాలీవుడ్‌లో మరో భారీ ప్రాజెక్టులో భాగం కానుంది.

రామ్‌చరణ్ హీరోగా 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సాన దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందనుంది. ఇందులో హీరోయిన్‌గా జాన్వీకపూర్‌ను సంప్రదించగా ఆమె ఒకే చెప్పినట్టు తెలుస్తోంది. అదే నిజమైతే 'ఆర్‌ఆర్‌ఆర్'తో ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపును అందుకున్న ఇద్దరు స్టార్ హీరోలు ఎన్టీఆర్, చరణ్ సరసన నటించే అరుదైన అవకాశం ఆమెను వరించనుంది. చరణ్‌తో కబడ్డీ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కే చిత్రం ప్రీ ప్రొడక్షన్‌లో పనుల్లో దర్శకుడు బుచ్చిబాబు బిజీగా ఉన్నాడు. ఇందులో చరణ్ రెండు పాత్రల్లో నటిస్తాడని, ఒక హీరోయిన్‌గా జాన్వీకపూర్‌ను, మరో హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్‌ని తీసుకుంటారని సమాచారం.

## తారాతీరం



# ప్రతినాయకుడిగా సైఫ్ అలీఖాన్!

కొరటాల-ఎన్టీఆర్ కాంబినేషన్‌లో ఒక సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. కెరియర్ పరంగా ఇది ఎన్టీఆర్‌కి 30వ సినిమా. ఎన్టీఆర్ ఆర్ట్స్-యువసుధ ఆర్ట్స్ వారు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో కథానాయికగా జాన్వీకపూర్‌ను తీసుకున్నారు. ఈ సినిమాతోనే టాలీవుడ్‌కి కథానాయికగా పరిచయమవుతోంది. హైదరాబాద్‌లో జరుగుతున్న షూటింగులో జాన్వీకపూర్, సైఫ్ అలీఖాన్‌లు జాయిన్ అయినట్లు తెలుస్తోంది. ఈ ముగ్గురి కాంబినేషన కీలకమైన సన్నివేశాలను ప్లాన్ చేసినట్లు సమాచారం. సైఫ్ తెలుగులో చేస్తున్న మొదటి సినిమా ఇది. భారీ బడ్జెట్‌తో నిర్మితమవుతున్న ఈ సినిమా షూటింగ్ ఎక్కువగా విదేశాల్లోనే జరుగనున్నట్లు తెలుస్తోంది. సంగీత దర్శకుడు అనిరుధ్. ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానున్నట్లు సమాచారం.

ఆదివారం వార్త
sunmagvaartha@gmail.com
30 ఏప్రిల్, 2023

## మంచి ముత్యాలు


సాధారణమైన జీవనం,
ఉన్నతమైన భావాలు గల మనిషి ధన్యుడు.
- వర్డ్స్‌వర్త్

## విషయ విశేషం

రంగుల గోరింటాకు... 4
'సంఘీ'భావం....5
వృద్ధాలను తగ్గిస్తేనే భవిష్యత్తు
కవర్ స్టోరీ..6
సాంకేతిక వల
వరమా? శాపమా?
ఈవారం కవిత్వం..12
మనసు ఎక్కడ పోగొట్టుకున్నావు?
నవ్వుతూ జీవిద్దాం...14
స్వేచ్ఛ కోసం రెక్కలు విప్పుతున్న మీడియా...18
కథ.. 20
అపూర్వ విద్యార్థి
కోపంతో తంటాలు...23
ఆకట్టుకునే ఆస్ట్రేలియా అందాలు ...25
మాష్టారు....30
ఇంకా..
పుస్తక సమీక్ష
మొగ్గ
వారఫలం
వగైరా..వగైరా..

# తాజా వార్తలు

## చల్లని గాలినిచ్చే ఫొటోఫ్రేమ్



కీర్తన వాళ్లింటికి తన స్నేహితురాలు వచ్చింది. ఎండలో వచ్చిన ఆమెకు హాల్లోకి రాగానే చాలా చల్లగా అనిపించింది. కిటికీలు మూసే ఉన్నాయి. అయినా గదంతా హాయిగా ఉంది. చూస్తే ఎక్కడా ఏసీ లాంటిది కూడా కనిపించలేదు. ఓ అరగంట అయ్యాక ఉండబట్టలేక కీర్తనను అడిగేసింది. 'ఈ చల్లదనానికి కారణం ఏసీ గాలే' అంటూ అక్కడున్న ఎయిర్ కండీషనర్ని చూపించింది కీర్తన. అచ్చంగా ఫొటోఫ్రేమ్‌లా ఉన్న ఆ ఏసీని చూసి ఇంటికొచ్చిన అతిథి ఎంతో ఆశ్చర్యపోయింది. ప్రతి వస్తువులోనూ వైవిధ్యాన్ని కోరుకునే వాళ్ల కోసం 'ఆర్ట్‌కూల్ ఎల్‌జీ గ్యాలెరీ స్ప్లిట్ ఏసీ' దొరుకుతోంది. ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్న ఈ ఏసీ యాప్‌తో పనిచేస్తుంది. ఎక్కడి నుంచైనా ఉష్ణోగ్రతను పెంచడమూ, తగ్గించడమూ చేయొచ్చు. అంతేకాదు, చలికాలంలో వేడి గాలినిచ్చే హీటర్‌లానూ పనిచేస్తుంది. దీంట్లో మామూలు ఏసీలో ఉండే సాంకేతికత అంతా ఉంటుంది కానీ అసలు ప్రత్యేకత ఏసీలా కాకుండా ఫొటోఫ్రేమ్‌లా కనిపించడమే.

### పల్లీలు మంచివే

ఆరోగ్యంగా ఉన్నవాళ్లు వయసులో ఉన్నవాళ్లూ పల్లీలుగానీ పల్లీ బటర్‌గాని తింటే, రక్తనాళాల పనితీరు మెరుగవుతుందని బార్సిలోనా యూనివర్సిటీకి చెందిన నిపుణులు చేసిన పరిశోధనలో స్పష్టమైందట. వేరుసెనగల్లో సమృద్ధిగా ఉండే ఫ్యాటీ అమ్లాలూ ప్రొటీన్లు పీచూ పాలీఫినాల్స్..అన్నీ కలిసి ఆరోగ్యానికి మేలు చేస్తున్నట్లు ప్రయోగపూర్వకంగా గుర్తించి మరీ చెబుతున్నారు. ఇందుకోసం వీళ్లు ఆరోగ్యంగా ఉన్న 18-33 ఏళ్లలోపు వ్యక్తుల్ని ఎంపిక చేసి వాళ్లకి ఆరునెలలపాటు రోజువారీ ఆహారంలో వేరుసెనగల్ని చేర్చారట. ఆ తరువాత మళ్లీ పరీక్షించినప్పుడు వాళ్లలో రక్తనాళాల్ని వ్యాకోచింపజేసి, వాటి పనితీరుని మెరుగుపరిచే ప్రొస్టాసైక్లిన్-12, థ్రాంబాక్సేన్-ఎ2..వంటి వాస్క్యులర్ మార్కర్ల శాతం పెరిగినట్లు గుర్తించారు. దీని ఆధారంగా పల్లీలు తినడంవల్ల రక్తప్రసరణ వ్యవస్థ మెరుగవుతుందనీ కాబట్టి ఆరోగ్యంగా ఉన్నవాళ్లు వీటిని తగుమోతాదులో క్రమం తప్పక తీసుకోవడం మంచిదేననీ చెబుతున్నారు.







# రంగుల గోరింటాకు

**అమ్మాయిల** సుకుమారమైన అరచేతులమీద ఎర్రని గోరింట పండగానే ఇంటికే వేదుక కళ వచ్చినట్లుంది. అందుకేనేమో పండుగైనా, పేరంటమైనా ముందు పాపాయిల చేతికి గోరింటాకు పెట్టేసి మురిసిపోతుంటారు తల్లులు. కాలంతోపాటు గోరింటా మారింది. కోన్‌లోకి చేరి క్షణాల్లో చేతుల మీద సరికొత్త డిజైన్లను ఆవిష్కరించడం చూస్తూనే ఉన్నాం. ఈ డిజైన్లలోని వైవిధ్యాన్ని రంగుల్లో చూపించడానికి ఇప్పుడు అదే గోరింటాకు ఏకంగా 'కలర్ హెన్నా కోన్స్'లా వచ్చేసింది. ఈ హెహాందీ కోన్ రంగులు చూడ్డానికే కాదు..అవే రంగులతో పండటమే వీటి అసలు ప్రత్యేకత. మామూలు మెహందీలానే వీటితోనూ చేతిపైన నచ్చిన డిజైన్ పెట్టేసుకోవచ్చు. కాసేపటికి అది పూర్తిగా ఆరిన తర్వాత తొలగిస్తే సరి. మనం పెట్టుకున్న రంగుల్లో మెహందీ డిజైన్ చేతిపైన ప్రత్యక్షమవుతుంది. వాటర్‌ప్రూఫ్ రంగులతో ఉండే ఈ మెహందీ మూడు నుంచి నాలుగు రోజులపాటూ పోకుండా ఉంటుంది.













# 'సంఘీ' భావం



## వ్యర్థాలను తగ్గిస్తేనే భవిష్యత్తు

ఆధునిక సమాజంలో మానవ జీవనశైలిలో స్పష్టమైన మార్పులు రావడంతో వ్యర్థాలు ఎక్కువ స్థాయిలో విసర్జించబడుతున్నాయి. రెండు మూడు దశాబ్దాల క్రితంతో పోలిస్తే సుమారు నాలుగు రెట్లు వ్యర్థాలు భూమిపై పోగు అవుతున్నాయి. దీనితో నగరాలు, పెద్దస్థాయి పట్టణాల్లో చెత్తను తరలించేందుకు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. ప్రతి విషయంలో ఉపయోగించి పారవేసే (యూజ్ అండ్ థ్రో) వస్తువులు పెరిగిపోతున్నాయి. తెల్లవారు జామున ఉపయోగించే పాల ప్యాకెట్‌లతో పాటు రాత్రి వరకు యూజ్ అండ్ థ్రో వస్తువులు అత్యధికంగా ఉంటున్నాయి. ఏదైనా ఒక వస్తువు ఉత్పత్తి అయితే కనీసం నెల రోజులైనా తిరిగి ఉపయోగించే విధంగా ఉండాలన్న సిద్ధాంతాన్ని పక్కన పెట్టారు. ముఖ్యంగా ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల పర్యావరణానికి ఎక్కువ ముప్పు వాటిల్లుతోంది. ప్లాస్టిక్‌తోనే కాకుండా కొన్ని రకాల లోహాలు, కలప, అట్ట వస్తువులు వంటివి ఎక్కువగా ప్రజలు ఉపయోగిస్తున్నారు. ప్రపంచం మొత్తం మీద సుమారు పదివేల టన్నుల వరకు వ్యర్థాలు ఉంటున్నాయని సర్వేలు చెబుతున్నాయి. ఒకసారి వాడిన వస్తువులు మళ్లీ వినియోగంలోకి తీసుకురావడానికి చర్యలు తీసుకోవాలి. హైదరాబాద్‌లోని జవహర్‌నగర్‌లో చెత్తను రీసైక్లింగ్ చేయడానికి ప్రభుత్వం భారీగానే ఖర్చు చేస్తోంది. అయితే నగరం నుంచి వస్తున్న చెత్త సుమారు పది కిలోమీటర్ల విస్తీర్ణాన్ని కాలుష్యంగా మార్చివేస్తోంది. ఈ పరిధిలో బోరుబావులు సైతం కలుషితం అవుతున్నాయి అంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. వ్యర్థాలను తగ్గించుకోవడం, కర్బన ఉద్గారకాలను తగ్గించడం వంటి అంశాలపై దృష్టి సారించాల్సి ఉంది. కొందరికి పనికిరాని వస్తువులు మరికొందరికి పనికి వస్తాయి. ఉదాహరణకు పాత కంప్యూటర్లు, ఏసీ మిషన్లు, టీవీలు, ఫ్రిజ్‌లు వంటివి పాడైపోతే చెత్తకుప్పలో పడేస్తాం. మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది వీటిని డంపింగ్‌యార్డుకు తరలించి తమ పనిపూర్తి చేస్తారు. అయితే వీటిలో కొన్ని పరికరాలు, పార్టులు వేరే వాటికి ఉపయోగపడతాయి. వీటిని విడదీసి మార్కెట్‌కు తరలిస్తే అవసరమైన వారు వాటిని తక్కువ ధరకు కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది. హైదరాబాద్‌లోని పాతబస్తీలో చార్మినార్ వద్ద ప్రతి ఆదివారం ఉపయోగించి పారేసిన వస్తువులను మెరుగులు దిద్ది విక్రయిస్తుంటారు. ఉదాహరణకు సీలింగ్ ఫ్యాన్ రెక్కలు, కూలర్ల డోర్లు, మోటారు సైకిల్ రిమ్ములు, గ్యాస్ స్టవ్ విడిభాగాలు, టివిలు, టేప్‌రికార్డర్లు, టేబుల్‌ఫ్యాన్ పార్టులు విక్రయిస్తుంటారు. ఇవి చాలా తక్కువ ధరకు విక్రయిస్తుంటారు. దీనితో ఈ ప్రాంతం ఆదివారం వస్తే చాలు రద్దీగా మారుతుంది. అతి తక్కువ ధరకు తమకు కావాల్సిన పరికరాలను కొనుగోలు చేసి ఇంట్లో వృథా పడి ఉన్న వస్తువులకు బిగించడం ద్వారా వాటిని వినియోగంలోకి తీసుకువస్తుంటారు. ఇలాంటి మార్కెట్ల వల్ల పర్యావరణానికి ఎంతో ఉపయోగం కలుగుతుంది. పారేసిన వస్తువులను, పరికరాలను తిరిగి వినియోగంలోకి తీసుకువస్తారు. మరోవక్క ఇంట్లో వృథాగా ఉంచుకుని పారేద్దామన్న ఆలోచనతో ఉన్న వారికి ఇలాంటి చిన్న పరికరాలు అమర్చుకోవడం ద్వారా మరికొంతకాలం వినియోగిస్తారు. ఇలాంటి మార్కెట్‌లు చాలా అరుదుగా ఉంటాయి. ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహం వీరికి ఉండదు. పైగా ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతోందని పోలీసులు వీరిని అక్కడి నుంచి వెళ్లిపోవాలని హుకుం జారీ చేస్తుంటారు. ప్లాస్టిక్‌ను కూడా తిరిగి ఉపయోగించే విధంగా రీసైక్లింగ్ యంత్రాలను ఎక్కువ సంఖ్యలో మార్కెట్‌లోకి తీసుకురావాలి. ఇప్పటికే వ్యర్థాల సమస్య అధికంగా ఉంటే కొవిడ్ వల్ల డిస్పోజబుల్ మాస్కులు, గ్లోస్‌లు, సానిటైజర్ బాటిల్స్ వంటివి విరివిగా మార్కెట్‌లోకి వచ్చి చేరాయి. కొవిడ్ నుంచి కాపాడుకునేందుకు వాడే అనేక వస్తువులు ఒకసారి గాని, ఒకరోజు గాని ఉపయోగించి పారేసేవే ఉన్నాయి. తిరుమలలో ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్‌ను నిషేధించారు. ఈ స్థానంలో గాజు సీసాలు అందిస్తున్నారు. ఈ సీసాల్లో నీటిని తాగిన తరువాత తిరిగి వాటిని దుకాణదారుకు ఇచ్చేయవచ్చు. పైగా ఏ దుకాణంలో తీసుకున్నామో అక్కడే ఇవ్వవలసిన అవసరం లేదు. ఏ షాపులో ఇచ్చినా తీసుకుంటారు. దీనివల్ల తిరుమలలో ప్లాస్టిక్ వాటర్ బాటిళ్ల బెడద తప్పింది. ఇక ప్రసాదం కూడా ప్లాస్టిక్ కవర్‌లో కాకుండా నేలలో కరిగిపోయే వాటితో తయారు చేసిన జ్యూట్ బ్యాగులను ఇస్తున్నారు. బట్టల తయారీలో దాదాపు 65 శాతం పాలిస్టర్, యాక్రిలిక్, నైలాన్, సింథటిక్ వంటి పదార్థాలు ఉపయోగిస్తారు. ఇవన్నీ ఐదారు నెలలు వాడి చెత్తకుప్పలో వేస్తారు. వీటిని సేకరించి నులకడం ద్వారా బలమైన తాళ్లను తయారుచేసే అవకాశం ఉంటుంది. కాని సర్వేలు చెబుతున్న ప్రకారం 85 శాతం బట్టలు వ్యర్థపదార్థాల జాబితాల్లో భూమిపై వచ్చి చేరుతున్నాయి. ఇలా చాలా వస్తువులు దానికి పునర్వినియోగం స్థాయి ఉన్నప్పటికీ చెత్తకుప్పలకు చేరి పర్యావరణాన్ని దెబ్బతీస్తున్నాయి. ముఖ్యంగా ప్లాస్టిక్ వల్ల కలుగుతున్న నష్టం ఇతర ఏ వస్తువుల వల్ల కలగడం లేదు. కొంతకాలం ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించుకున్నారు. షాపుల్లో, మార్కెట్‌లో ప్లాస్టిక్ బ్యాగులు ఇచ్చేవారు కాదు. అయితే ఈ పద్ధతి కేవలం నెల రెండు నెలలు మాత్రమే కొనసాగేది. ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో దుకాణదారులు క్రమంగా తిరిగి ప్లాస్టిక్ వినియోగం వైపు మొగ్గు చూపారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలంటే బ్యాగులను ఉత్పత్తి చేసే సంస్థలను మూసివేస్తే సరిపోతుంది. పర్యావరణం పట్ల కఠిన చర్యలు తీసుకుంటేనే తగిన ప్రతి ఫలం ఉంటుంది. వ్యర్థాలను తగ్గించడానికి, వ్యర్థాలను తిరిగి ఉపయోగంలోకి తీసుకురావడానికి తగిన ప్రణాళిక రూపుదిద్దాల్సిన అవసరం ఉంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



# సాంకేతిక వల
# వరమా? శాపమా?

కవర్ స్టోరీ

సుంకవల్లి సత్తిరాజు

ప్రస్తుతం మనం అనుభవిస్తున్న సౌకర్యాలు, అభివృద్ధి, మానవ జీవితంలో చోటు చేసుకున్న అనేక మార్పులకు గల కారణాలను ఒకసారి గుర్తు చేసుకోవాలి. ఒకప్పుడు సమాచార వ్యవస్థ లేక అత్యంత దుర్భరంగా సాగిన మానవ జీవితం నేడు ఇంతగా మార్పులను సంతరించుకోవడం, టెక్నాలజీ వలన ప్రపంచమే మన ముంగిట సాక్షాత్కారించడం ఒక గొప్ప అనుభూతి. టెక్నాలజీ వలన అందు బాటులోకి వచ్చిన అనేక ఎలక్ట్రానిక్ సాధనాలు మానవ స్థితి గతులను, జీవన విధానాన్ని సమూలంగా మార్చేశాయి. నేటి ప్రపంచం గురించి ఆలోచించే ముందు ఒక్కసారి గతాన్ని ఆకళింపు చేసుకోవాలి. గతం లేనిదే వర్తమానం లేదు. భవిష్యత్తుకు విలువ లేదు. మనిషి ఎంత ఉన్నత స్థితికి ఎదిగినా, ఎక్కించిన నిచ్చెనను మరవకూ డదు. మొదటి అడుగు లేకపోతే తర్వాత అడుగులు ఎలా పడతాయి? అనే మీమాంస అవసరం. నాడు చేసిన చిన్న చిన్న పరిశోధనలు, ఆవిష్కరణలు నేటి మానవ అభ్యున్నతికి దోహదం చేసిన మాట కాదనలేని సత్యం. మానవుడు నాగరికత పెంపొందించుకుని జీవించడమే ఒక పెద్ద మార్పు. నాగరికుడుగా ఎదగా లన్న ఆకాంక్ష నేటి ఆధునికతకు మార్గాన్ని సుగమం చేసింది. మానవుడు సంఘ జీవి, సమాజంలోని ఇతర వ్యక్తులతో సంబంధం లేకుండా మనలేడు. మనుగడ సాగించలేడు. మానవ జీవితం నాగరికత సంతరించుకున్న తర్వాత ఎన్నో శతాబ్దాలు సమిష్టి తత్వంతో పెనవేసుకుని కొన సాగింది. ఆటవిక జీవనం నుండి ఆధునిక జీవనం వరకూ వివిధ కారణాల రీత్యా అందరూ కలసి మెలసి జీవించక తప్పదనే వాస్తవాన్ని మానవ జీవితం విశదీకరిస్తు న్నది. ప్రస్తుతం ఇరాక్‌గా పిలవబడుతున్న ఒకప్పటి మెసపోటమియాలో, తర్వాత ఈజిప్టులో, సింధులోయాలో, మెక్సికోలో క్రీస్తుపూర్వమే నాగరికత ఆవిర్భవించినట్లు చరిత్రకారుల కథనాల వలన తెలుస్తున్నది. భారత, పాకిస్తాన్‌ల మధ్య విలసిల్లిన నాగరికత అత్యంత ప్రాచీనమైనది.

పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, తురక్‌మెనిస్థాన్‌లలో ప్రాచీన నాగరికతకు చెందిన అవశేషాలు లభ్యమవుతాయి. హరప్పా నాగరికత చాలా విశిష్ఠమైనది. సింధు నాగరికతను హరప్పా నాగరికత అని కూడా అంటారు. ప్రతీ దేశం తమను తాము గొప్పగా అభివర్ణించుకోవచ్చు. కానీ ఒక దేశం లేదా ఒక ప్రాంతంలోని ప్రజలు వివిధ దేశాలకు, ప్రాంతాలకు వలస వెళ్లడం, వ్యవసాయం చేయడం, భాషలు వృద్ధి చెందడం వలన మానవ జీవితంలో అనేక మార్పులు సంభవించాయి. నాగరికతకు పునాది వ్యవసాయం. భావ వ్యక్తీకరణ వలన ఒకరి ఆలోచనలు మరొకరు పంచుకోవడం జరిగింది. వివిధ భాషల వలన ఒక దేశంలోని ఆచార వ్యవహారాలు మరో దేశానికి పరిచయమయ్యాయి. ఇది ప్రాచీన కాలంలోనే జరిగింది. నాగరికత పెరగడం వలన మానవ జీవితంలో అనేక మార్పులు సంభవించి, ప్రస్తుత ఆధునిక ప్రపంచం ఆవిష్కరింప బడింది. మానవ అంతరంగం అంతులేని సాగర పయనం. మానవ మస్తిష్కం అనంతమైన ఆలోచనా తరంగాల సమూహం. ప్రతీ విషయాన్ని క్షుణ్ణంగా ఆలోచించి, విశ్లేషించడం, కూలంకషంగా అధ్యయనం చేసి, ఆసక్తితో తీవ్రంగా పరిశోధించడం మానవ జాతిలోని ఒక అత్యున్నత లక్షణం. మేథోమథనం ద్వారా, ఇతరుల ఆలోచనల ద్వారా ఒక అవగాహన కలిగించుకుని, విషయ పరిజ్ఞానాన్ని ప్రయోగాత్మక పద్ధతితో రంగరించి, ఫలితాలను రాబట్టడం, వైఫల్యాల నుండి పాఠాలు నేర్చుకుని నిర్విరామ సాధనతో అంతిమంగా విజయం సాధించడం మానవ మేథస్సుకు దర్పణం. అందువలన మానవుడు ఈ సువిశాల భూ ప్రపంచంలో అత్యుత్తమ శక్తివంతుడిగా అవతరించాడు. అడవుల్లో క్రూరమృగాల మధ్య జీవిస్తూ, వేటను వృత్తిగా స్వీకరించి, పచ్చిమాంసం భుజిస్తూ, నగ్నంగా జీవించే ఆదిమానవుడు కూడా అప్పటికే ఇతర జీవరాశుల కంటే తెలివైనవాడే.

క్రూర జంతువుల నుండి తప్పించుకోవడానికి తీసుకున్న మెళకువలు, వేటాడడానికి ఉపయోగించే పరికరాలు అతని తెలివితేటలకు నిదర్శనం. నిప్పును కనిపెట్టి వంట చేయడం మానవ జీవితాన్ని ఎంతగానో మార్చింది. అభద్రత మధ్య జీవించడం తగదని భావించి, సురక్షిత నివాసాలను ఏర్పాటు చేసుకున్నాడు. వ్యవసాయం నేర్చుకున్నాడు. భాష నేర్చుకుని, భావ వ్యక్తీకరణ సులభతరం చేసుకున్నాడు. ఒకచోట నుంచి, మరో చోటికి ప్రయాణం చేయడానికి అనువైన మార్గాలను కనిపెట్టాడు. మానవ జిజ్ఞాస ఎన్నో కొత్త విషయాలను కనిపెట్టడానికి దోహదం చేసింది. దాని ఫలితంగానే 'సైన్స్' ఆవిర్భవించింది. సైన్స్ అంటే వింతకాదు. వాస్తవ ఆలోచనలకు ప్రయోగాత్మక కార్యరూపమే 'సైన్స్'. మొదట్లో సైన్స్‌ను దైవధిక్కారంగా భావించేవారు. నిజాలను చెప్పినందుకుగాను అనేక మంది శాస్త్రవేత్తలు తీవ్రమైన శిక్షలకు గురి కాబడ్డారు. కొంతమందికి యావజ్జీవ కారాగారవాసం, మరికొంతమందికి ఉరిశిక్షలు, కొంత మందిని సజీవ దహనం చేయడం వంటి చర్యలు నాటి అశాస్త్రీయ మైన సమాజంలో కొనసాగాయి. సైన్స్ అంటే ఒక నేరం, పాపంగా భావించే నాటి రోజులు గతించాయి. సైన్స్ పట్ల అవగాహన పెరిగింది. సైన్స్ లేనిదే పూట గడవని పరిస్థితులు ఏర్పడ్డాయి. రవాణా సౌకర్యాలు పెరిగాయి. రవాణా వ్యవస్థలో అనేక నూతన మార్పులు సంభవించాయి. రోడ్డు, రైల్వే, విమాన సర్వీసులు విస్తృతంగా వ్యాప్తి చెందాయి. పూర్వ కాలంలో విదేశాలకు రాకపోకలు కేవలం సుదీర్ఘ సముద్ర ప్రయాణం మీద ఆధారపడి ఉండేవి. ఇది అత్యంత క్లిష్టతరంగా ఉండేది. అయితే కాలక్రమంలో సైన్స్ అనేక ఆవిష్కరణలకు నాంది పలికింది. సాంకేతిక పరిజ్ఞానం ప్రజా జీవితంలో పెను విప్లవాన్ని తెచ్చింది. అలెగ్జాండర్ గ్రాహంబెల్ టెలిఫోన్ కనిపెట్టడం జరిగింది. ఇటాలియన్ ఇంజినీర్ మార్కోనీ రేడియో ఆవిష్కరణ 'వైర్‌లెస్ సమాచార వ్యవస్థ'కు ఊపిరి పోసింది. జె.ఎల్.బయర్డ్, ఫిలోటేలర్ ఫ్రాన్స్‌వర్త్‌లు తమ పరిధిలో టెలివిజన్ రూపకల్పనలో విశేష కృషి చేసారు. అలెగ్జాండర్ గ్రాహంబెల్ టెలిఫోన్ కనిపెట్టిన తర్వాత దానికి కొనసాగింపుగా అనేక మంది శాస్త్రవేత్తలు టెలిఫోన్ వ్యవస్థను ఆధునికీకరించడానికి విశేష కృషి చేసారు. కాలక్రమంలో అమెరికాకు చెందిన మార్టిన్ కూపర్ చరవాణికి అంకురార్పణ గావించాడు. మార్టిన్ కూపర్ రూపొందించిన చరవాణి, అనేక మార్పులు సంతరించుకుని, ప్రస్తుతం ఆధునిక రూపంలో ప్రజల చేతిలో ఒక వినూత్న ఎలక్ట్రానిక్ పరికరంలా ఇమిడిపోయింది. తాను రూపొందించిన ఈ చిన్న పరికరం ప్రపంచాన్ని ఇంతగా మారుస్తుందనుకోలేదని ఇటీవల మార్టిన్ కూపర్ సైతం ఆశ్చర్యం వ్యక్తం చేసిన విషయం విదితమే. వైర్‌లెస్ కమ్యూనికేషన్ వ్యవస్థకు ఆద్యుడిగా భావిస్తున్న మార్టిన్ కూపర్ వలన తదనంతర కాలంలో చరవాణి అనేక మార్పులు సంతరించుకుని, వర్తమానంలో జనజీవితాలను శాసిస్తున్నది. ప్రస్తుతం



మొబైల్ ఫోన్ల వినియోగం విపరీతంగా పెరిగింది. 5జి రాకతో మరింత వేగం సంతరించుకుంది. రాబోయే కాలంలో మరింత మెరుగైన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రాబోయే 6జి, 7జి మొబైల్ ఫోన్లు ప్రపంచ గతిని ఎలా మారుస్తాయో వర్ణింపశక్యం కాదు. ఆనందానికే కాదు, ఆందోళనకు కూడా కారణమౌతున్న మొబైల్ ఫోన్లు మనిషిని ఎటువైపు తీసుకుపోతాయో ఊహించడం కూడా కష్టసాధ్యం. చాలా కాలం వరకు సమాచార సేకరణ కోసం, వినోదం కోసం, విజ్ఞానం కోసం కంప్యూటర్ల మీద అధికంగా ఆధారపడేవారు. ఇంటర్నెట్ సౌకర్యాన్ని అందించడానికి అనేక ఇంటర్నెట్ సెంటర్లు వెలిసాయి. స్కానర్లు, ప్రింటర్లు, ఆధునిక రూపాన్ని సంతరించుకున్నాయి. డెస్క్‌టాప్‌ల స్థానంలో ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లు అందుబాటులోకి వచ్చాయి. ప్రయాణంలో కూడా ఈ పరికరాలు అనేక విధాలుగా వెసులుబాటు కలిగిస్తున్నాయి. కేవలం కంప్యూటర్లకే పరిమితమైన అనేక సదుపాయాలు నేడు అరచేతిలో ఇమిడిపోయే మొబైల్ ఫోన్లకు కూడా అందుబాటులోకి వచ్చాయి. నిత్యం అనేక అప్లికేషన్లు మొబైల్ వినియోగదారుల అభిరుచులకు అద్దం పడుతున్నాయి. వీడియోలు, సెల్ఫీల కోసం అధిక సామర్థ్యం గల కెమెరాలు మొబైల్ ఫోన్లలో ఏర్పాటు చేయడం జరిగింది. మొబైల్ వినియోగం విపరీతంగా పెరిగిపోయింది. ఆహారం లేకపోయినా బతకగలమేమో కానీ మొబైల్ ఫోన్లు లేకపోతే జీవితమే శూన్యంలా భావించే రోజులొచ్చాయి. ఒక రకంగా చెప్పాలంటే మొబైల్ లేని జీవితం అత్యంత దుర్భరమనే భావన ఏర్పడిపోయింది.

నగరాల్లో గత్యంతరం లేని పరిస్థితుల్లో నాలుగు గోడల మధ్య యాంత్రిక జీవనం గడపడం అలవాటుగా మారింది. ఉద్యోగ బాధ్యతలు, పిల్లల పెంపకాలు, వారి చదువులతో నగర జీవులు నలుగురికీ దూరమైపోయారు. కానీ ఇలాంటి వాతా వరణం నేడు పల్లెజీవితాల్లోనూ ప్రవేశం చింది. నగరవాసుల ఆధునిక జీవనశైలిని పల్లెజీవులు అనుకరించడం ఒక కారణ మైతే, సెల్‌ఫోన్ల విచ్చలవిడి వాడకం మరో కారణం.

విద్యావంతులతో పాటు, అక్షర పరిజ్ఞానం లేనివారు సైతం మొబైల్ వాడకాన్ని అధికం చేసారు. మొబైల్ వినియోగానికి చదువుతో సంబంధం లేదనే వాదన నిరక్షరాస్యుల చేతుల్లో నిండుగా ఒదిగిపోయింది. కేవలం కొంత మంది ఎఫ్.ఎం.ల కోసం మాత్రమే రేడియోలను వినియోగిస్తున్నారు. వార్తా పత్రికలను కూడా చాలామంది చదవడం మానేశారు. టెలివిజన్ కూడా అనేక మార్పులు సంతరించుకుంది. సమాచార, సాంకేతిక విప్లవం వెల్లువెత్తింది. అయితే వర్తమానంలో టెలివిజన్లను కూడా చాలా మంది వీక్షించడం వదిలేసారు. ఎక్కడ చూసినా మొబైల్ ఫోన్ల విప్లవం హోరెత్తిపోతున్నది. వార్తాపత్రికలందించే సమాచారం, టెలివిజన్లు చూపించే వార్తలు, వినోధ కార్యక్రమాలు వివిధ రూపాల్లో మొబైల్ ఫోన్లలో లభ్యమౌతున్నాయి.

ఇందుకోసం వివిధ అప్లికేషన్లు అందుబాటులోకి వచ్చాయి. ఏ వార్తా పత్రిక చదవాలన్నా 'గూగుల్ సెర్చ్ ఇంజన్' సిద్ధంగా ఉంది. ఎన్నో యూట్యూబ్ ఛానెళ్లు విస్తృతంగా ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. ఫుడ్ యాప్‌లు, రోడ్డు, రైల్వే, విమాన ప్రయాణాల కోసం ఆన్‌లైన్ బుకింగ్ వ్యవస్థకు మొబైల్ ఫోన్లు వినియోగపడుతున్నాయి. ఆర్థిక వ్యవహారాల కోసం బ్యాంకులకు వెళ్లవలసిన అవసరం లేదు. ఎ.టి.యం.కార్డులతో పని లేదు. బ్యాంకులకు వెళ్లి గంటల తరబడి క్యూలలో నిలబడే అవసరం అంతకంటే లేదు. ఆన్‌లైన్ ట్రాన్సాక్షన్ల కోసం నెట్ బ్యాంకింగ్, పేటీయం, ఫోన్ పే, గూగుల్ పేలు అందుబాటులోకి వచ్చి, అర క్షణం ఆలస్యం కాకుండా ఆర్థిక వ్యవహారాలు చక్కగా జరిగిపోతున్నాయి. సోషల్ మీడియా జనజీవితాలను తన గుప్పెట్లో పెట్టుకుని ఆటాడించడం ఆరంభించింది. సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలలో ఫేస్‌బుక్, వాట్సప్, ఇన్‌స్టాగ్రాం, ట్విట్టర్ మొదలైనవి ప్రముఖమైనవి.

నేడు సోషల్ మీడియాను ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు వినియోగిస్తున్నారు. ఇది ప్రపంచ జనాభాలో సగం కంటే ఎక్కువ. ఇంత బహుళ ప్రాచుర్యం పొందిన సోషల్ మీడియాను సుమారు 59 శాతం మంది వివిధ అవసరాలకు వినియోగిస్తున్నారు. 80 శాతం పైగా అమెరికన్లు సాంఘిక మాధ్యమాన్ని ఉపయోగిస్తున్నారు. చైనాలో 100 కోట్ల మంది సోషల్ మీడియా యూజర్లున్నారు. 30 సంవత్సరాల లోపు వయసుగల సుమారు 47 శాతం మంది టిక్ టాక్ ఉపయోగిస్తున్నారు. చైనాలో ఫేస్‌బుక్ యూజర్ల సంఖ్య మిలియన్ల సంఖ్యలో ఉంది. అయితే ఇతర దేశాల్లో దీని వినియోగం ఎంతో అధికం. సోషల్ మీడియా ప్లాట్‌ఫాం వ్యాపారాభివృద్ధి కోసం, వాణిజ్య ప్రకటనల ద్వారా ఆదాయం సమకూర్చుకోవడం కోసం, ఉపాధి అవకాశాల కోసం, కెరీర్‌ను తీర్చిదిద్దుకోవడం కోసం ఉపయోగపడుతున్నది. తమ ప్రతిభ కేవలం నాలుగుగోడల మధ్య నలిగిపోకుండా ప్రపంచానికి పరిచయం చేయడం కోసం చాలామంది సాంఘిక మాధ్యమాలను వినియోగిస్తున్నారు. సాంఘిక మాధ్యమాల ద్వారా ధనార్జన చేస్తున్నవారు కోకొల్లలు. అవకాశాల కోసం ఎదురు చూసేవారికి సోషల్ మీడియా ఒక కొంగుబంగారం. స్మార్ట్‌ఫోన్ వినియోగదారుడు ప్రతీరోజు సగటున సుమారు 2 గంటల సమయం వెచ్చిస్తున్నాడు. ప్రతీ నెలలో సుమారు 70 గంటల సమయాన్ని సోషల్ మీడియా యాప్స్ కోసం వినియోగిస్తున్నారు. 448 కోట్ల జనాభా అంటే ప్రపంచ జనాభాలో సుమారు 55 శాతం మంది ప్రజలు సోషల్ మీడియా ఎకౌంట్లు కలిగి ఉన్నారు. ప్రతీరోజు బిలియన్ల సంఖ్యలో ప్రపంచంలోని పలువురితో ఆత్మీయంగా కలిసే అవకాశం సోషల్ మీడియా సుసాధ్యం చేస్తున్నది. యాపిల్ ఐ ఫోన్ సోషల్ మీడియా జాతకాన్ని ఓ మలుపు తిప్పింది. ఇప్పుడు దాదాపు అన్ని బ్రాండెడ్ ఫోన్లలో వివిధ అప్లికేషన్లు యూజర్లను విపరీతంగా ఆకర్షిస్తున్నాయి. సోషల్ నెట్ వర్కింగ్ యాప్స్ ద్వారా లభిస్తున్న రెవిన్యూలో సగానికి పైగా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాంలదే. యు.ఎస్.లో ఫేస్‌బుక్ తర్వాత స్థానం ఇన్‌స్టాగ్రాందే. సోషల్ మీడియాలో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం, యూట్యూబ్, టిక్ టాక్, వాట్సప్, స్నాప్ చాట్, ట్విట్టర్, పిన్ టెరెస్ట్, లింక్‌డ్ ఇన్‌లు బాగా ప్రాచుర్యం పొందాయి. ఒకప్పుడు మన అభిప్రాయాలు వేరొకరితో సంచుకోవడానికి, మనల్ని మనం ఇతరులకు పరిచయం చేసుకోవడనాఇకి మనం రాసే పుస్తకాలు, పత్రికా వ్యాసాలు, మనం పాల్గొనే సమావేశాలు, ప్రసంగాలు ఎంతగానో ఉపయోగపడేవి. అయితే వర్తమానంలో వీటితో పెద్దగా అవసరం లేదు. ప్రతిభ ఉన్నా లేకపోయినా ఇష్టమైన రీతిలో అడ్డమైన పోస్టులు పెట్టడం, వీడియోలు పోస్టు చేయడం, అనవసరమైన గొడవలతో రచ్చ చేయడం వాటిని ఆస్వాదించే జనం పెరగడం చూస్తున్నాం. ఎవరికి వారు సోషల్ మీడియా సామ్రాజ్యానికి రారాజుల్లా వెలిగిపోవడానికి ప్రయత్నం చేస్తున్నారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలను సృష్టించి, తమ వ్యాపారాలను బిలియన్ల కోట్ల డాలర్లకు పెంచేసుకుంటూ కుబేరులుగా మారిపోయిన వారిని ఊహించుకుంటూ, మన సమయాన్ని వృథా చేస్తున్నాం. జి.బి.లకొద్దీ డేటాను కొనుగోలు చేసి, అవసరం లేకున్నా మన ఖర్చులను పెంచేకుంటున్నాం. ఒకప్పుడు కారుచౌకగా



లభించిన మొబైల్ డేటా నేడు విపరీతంగా పెరిగింది. అపరిమితమైన వాయిస్ కాల్స్ నేడు ఖరీదైన వ్యవహారంగా మారిపోయాయి. సెల్‌ఫోన్ ఖర్చులు సామాన్య ఫోన్ వినియోగదారులకు, స్మార్ట్‌ఫోన్ వినియోగదారుల జేబులకు చిల్లు పెడుతున్నాయి. దూరాన్ని దగ్గర చేసి, టెక్నాలజీ సహాయంతో ప్రపంచాన్ని మన చెంతకు చేర్చి, మన అభిప్రాయాలను, మన సంస్కృతీ సాంప్రదాయాలను, మన ఆచార వ్యవహారాలను మిగతా ప్రపంచానికి తెలియచేసే దగ్గరి దారి సోషల్ మీడియా. సాంఘిక మాధ్యమాలదను వినియోగించడానికి మనకొక ఎలక్ట్రానిక్ పరికరం అవసరం. అది కంప్యూటర్ కావచ్చు. ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్ కావచ్చు లేక ట్యాబ్, మొబైల్ కావచ్చు. ఏది ఏమైనా నేటి కాలానికి అత్యంత సౌకర్యవంతమైన సాంకేతిక సాధనంగా మొబైల్ జన హృదయాలను దోచుకుని, మనల్ని ఒక అద్భుతమైన ప్రపంచానికి తీసుకుపోయింది. మొబైల్ వినియోగం ఒక వ్యసనంలా మారిపోయింది. జీవితంలో ఒక విడదీయరాని సంబంధంగా మొబైల్ వ్యాపకం మారిపోయింది. ఈ సంవత్సరం ప్రారంభానికి ప్రపంచంలో 5 బిలియన్ల మంది ఇంటర్నెట్ వినియోగిస్తున్నారని ఒక అంచనా. ఇది ప్రపంచ జనాభాలో 64 శాతంగా ఉంది. ప్రపంచ జనాభాలో సుమారు 60 శాతం మంది సోషల్ మీడియా ఉపయోగిస్తున్నట్టు తాజా నివేదికలు సూచిస్తున్నాయి.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చడానికి శత విధాలా ప్రయత్నించినా దక్కని ఫలితం సోషల్ మీడియాకు మాత్రం దక్కింది. డిజిటల్ ప్రపంచంలో నిరక్షరాస్యులు కూడా భాగస్వామ్యం వహించడం ఆశ్చర్యకరమైనా, ప్రజల ఆసక్తి డిజిటల్ ప్రపంచాన్ని అందుబాటులోకి తెచ్చింది.

2023 చివరి నాటికి ఇన్‌స్టాగ్రాం యూజర్లు ప్రపంచ వ్యాప్తంగా 1.3 బిలియన్లకు పెరిగే అవకాశం ఉంది. ఇండియాలో దీని సంఖ్య 24 కోట్లు పెరిగే అవకాశం ఉంది. ఇండియాలో ఫేస్‌బుక్ యూజర్లు 31 కోట్లను అధిగమించే సూచనలున్నాయి. ప్రపంచంలో ఇంటర్నెట్ యూజర్ల సంఖ్య 2023 జనవరి నాటికి 5 బిలియన్లు దాటింది. ఫేస్‌బుక్ యాజమాన్యం గతంలోనే వాట్సప్, ఇన్‌స్టాగ్రాంలను కొనుగోలు చేసింది. ఫేస్ బుక్ ఒక సంవత్సరంలో దాదాపు 117 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని ఆర్జించింది. ఫేస్‌బుక్ నికర ఆదాయం గత సంవత్సరంలో సుమారు 23 బిలియన్ల డాలర్లు. 2010వ సంవత్సరంలో 2 బిలియన్ల డాలర్ల రెవిన్యూ గల ఫేస్‌బుక్ 2022 నాటికి 117 బిలియన్ల డాలర్ల ఆదాయానికి చేరడం ఆశ్చర్యకరం. ప్రపంచంలో ట్విట్టర్ యూజర్ల సంఖ్య 354 మిలియన్లు దాటింది.

అలాగే సోషల్ మీడియాలో గేమింగ్ బాగా ప్రజాదరణ పొందింది. వీటికి సంబంధించిన అనేక యాప్‌లు అందుబాటులోకి వచ్చాయి. సోషల్ మీడియా నెట్ వర్కింగ్‌కు ప్రధాన ఆదాయం ప్రకటనల ద్వారా సమకూరుతుంది. ప్రకటనల ద్వారా వీటి ఆదాయం బాగా పెరిగింది. గత సంవత్సరంలో సోషల్ నెట్ వర్క్ ఖాతాలో 5 బిలియన్లకు పైగా వినియోగదారులున్నారు. జుకర్‌బర్గ్ ప్రారంభించిన ఫేస్‌బుక్ నేడు అత్యంత ప్రజాదరణతో దూసుకుపోతున్నది. అయితే సోషల్ మీడియా వరమా? శాపమా? అనే సంశయం కలుగక మానదు. వర్తమాన సమాజంలో నెలకొంటున్న అస్తవ్యస్థ పోకడలను చూస్తే ఈ సందేహం సహేతుకమే.

భారతదేశంలో కూడా ఎలక్ట్రానిక్ గాడ్జెట్లను విరివిగా వినియోగిస్తున్నాం. ప్రపంచీకరణ ఫలితంగా భారతదేశం వివిధ దేశాలకు ఒక విలువైన వాణిజ్య కేంద్రంగా మారింది. ఆధునిక ప్రపంచ పోకడలు భారతీయ సమాజంలోని నాటి విలువలను క్రమేపీ నాశనం చేస్తున్నాయి. ఎంతో విలువైన జ్ఞాన సంపద, అరుదైన, విలక్షణమైన ప్రాచీన జీవన విధానం అడుగంటిపోయింది. మనం కూడా పాశ్చాత్య ప్రవాహంలో కొట్టుకుపోతున్నాం. దాని ఫలితంగా మన సమాజంలో కూడా మానవ సంబంధాలు మసకబారిపోతున్నాయి.

భారతదేశంలో అనాదిగా వేళ్లూనుకున్న ఉమ్మడి కుటుంబ వ్యవస్థ నశించింది. కుటుంబ సంబంధాలు కూడా క్షీణ దశకు చేరుకున్నాయి. న్యూక్లియర్ కుటుంబాల ఏర్పాటు ఒకవైపు ఉమ్మడి కుటుంబ వ్యవస్థను కుదేలు చేసింది. అయితే సమాజంలో నలుగురితో మమేకమై జీవించే పరిస్థితులు మెరుగ్గా ఉన్నాయని భావిస్తున్న వారికి వర్తమాన పరిణామాలు ఆవనిపాతంలా అగుపిస్తున్నాయి. అర్ధరాత్రి సెకండ్ షోలకు వెళ్లి గుంపులుగా రోడ్ల మీద కాలినడకన నడుస్తూ కబుర్లు చెప్పుకుంటూ ఎంతో అన్యోన్యంగా జీవించే నాటి పరిస్థితులు నేడు కనిపించడం లేదు. కేవలం చావుల్లోను, శుభకార్యాల్లోను మొక్కుబడిగా పలకరిస్తూ, మానవ



సంబంధాలను దూరం చేసుకుంటున్న వైనం అత్యంత బాధాకరం. ఒకప్పుడు ఏదైనా శుభకార్యం జరిగితే ప్రతీ ఇంటికి తిరిగి ఆహ్వానాలు అందించే ఆహ్లాదకరమైన వాతావరణం నేడు మృగ్యమైపోయింది. కేవలం చరవాణిలోనే పలకరింపులు, కృత్రిమ ఆప్యాయతలు ఒలకబోస్తున్నారు. భోజనాలు ఆరగించేసి, త్వరగా ఇంటికిపోయి, టి.వి.సీరియళ్ల కోసం, మొబైల్ చాటింగ్‌ల కోసం మానవ సంబంధాలను విచ్ఛిన్నం చేస్తున్న వైనం ప్రస్ఫుటంగా గోచరిస్తున్నది. అలనాటి కలుపుగోలుతనం ఇలలో ఒక కలగా మిగిలింది. చివరికి భార్యాభర్తలు, పిల్లలు సైతం ఎవరికి వారే గిరిగీసుకుని జీవిస్తున్నారు. అమ్మమ్మలు, నాన్నమ్మలు, ఇతర పెద్దలు పిల్లలకు నీతికథలు బోధిస్తూ, చందమామను చూపిస్తూ, గోరుముద్దలు తినిపిస్తూ జోలపాటతో నిద్రపుచ్చే ఒకప్పటి మధురమైన క్షణాలు కలలా కరిగిపోయి, కేవలం జ్ఞాపకాలుగా మిగిలిపోయాయి. పెద్దలంతా దిక్కులేని పక్షుల్లా అనాథాశ్రమాల్లో జీవిస్తున్నారు. రెక్కలొచ్చిన పక్షుల్లాంటి నవతరం పెళ్లిళ్లు చేసుకుని, వేరు కాపురాలతో ఉద్యోగరీత్యా నగరాలకు వలసబాట పట్టారు. పిల్లల్ని కని, వారి ఆలనా పాలనా పనివారికి వదిలేస్తున్నారు. పైగా చిన్న పిల్లలను తల్లిదండ్రులకు వేరు చేస్తూ, వారికి ప్రత్యేక గదులను కేటాయించి, ప్రేమాప్యాయతలకు దూరం చేస్తున్నారు. తల్లిదండ్రులు, పిల్లలు దగ్గర దగ్గరగా ఉన్నా మొబైల్ ఫోన్లు వారి మధ్య దూరాన్ని పెంచేస్తున్నాయి. ఒక చోట ఉంటున్నా, వాట్సప్ చాటింగ్‌లలో మునిగితేలడం మనుషులు మధ్య పెరుగుతున్న మానసిక దూరానికి ప్రత్యక్ష సాక్ష్యం. ఇక పాఠశాల స్థాయి నుండి, యూనివర్సిటీ స్థాయి వరకు, ఉద్యోగి స్థాయి నుండి పనిమనిషి స్థాయి వరకు అంతా మొబైల్ వాడకంలో మునిగి తేలుతున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేదు. కూర్చున్నా, నిలుచున్నా, ప్రయాణాలు చేస్తున్నా మొబైల్ ఫోన్లకు చేతివేళ్ల స్పర్శ తప్పనిసరి. బెడ్ రూమ్ దగ్గర నుండి బాత్రూమ్, టాయిలెట్ల వరకు మొబైల్ ఫోన్ల వ్యసనం ఒక మహమ్మారిగా మార్పు చెందింది. మన పంచేంద్రియాలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానపు చట్రంలో ఇరుక్కుపోయాయి. అయ్యవారిని చేయ బోతే కోతిలా మారిన చందంగా జ్ఞానానికి వినియోగించవలసిన చరవాణి విచక్షణ కోల్పోయి, సమాజాన్ని జీవచ్ఛవంలా మార్చేసింది. ఎక్కడున్నా మన ఆలోచనలు మొబైల్ ఫోన్ స్క్రీన్ మీదే కేంద్రీకరింపబ డుతున్న మాట కాదనలేం. శుభకార్యాల్లో ను మొబైల్ వీక్షణ అధికమైంది. ఫోటోలకే ప్రత్యేక స్థానమిస్తూ, ఆత్మీయ పలకరింపు లను అల్లంత దూరాన విసిరేస్తున్నాం. ఇకపోతే యువకులు, వృద్ధులు సైతం సాంఘిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టి, లైకుల కోసం, షేర్ల కోసం నానాతంటాలు పడుతున్నారు. నిత్యం అర్థం పర్థంలేని రీల్స్ చేస్తూ, స్టేటస్‌లు పెడుతూ సమాజాన్ని ఉద్ధరించడానికన్నట్టు పనికి మాలిన నటనలతో జనబాహుళ్యంపై పైత్యం వెదజల్లుతున్నారు. ప్రాంక్ వీడియోల పేరుతో నగ్నత్వాన్ని బాహాటంగా ప్రదర్శిస్తున్నారు.

ప్రస్తుత ప్రపంచంలో ఎలక్ట్రానిక్ సాధనాలు మానవ జీవితంలో పెను ప్రభావాన్ని చూపిస్తున్నాయి. శారీరక వ్యాయామం లేకపోవడం వలన అనేక అనారోగ్యాలు చుట్టుముడుతున్నాయి. చిన్న చిన్న పనుల కోసం కూడా ఎలక్ట్రానిక్ పరికరాలను వినియోగిస్తున్నారు. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం బద్ధకానికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ముఖ్యంగా మొబైల్ ఫోన్ల విచ్చలవిడి వినియోగం వలన ఆలోచనా జ్ఞానం నశిస్తున్నది. పుస్తకాలను చదవడం వదిలేసి గూగుల్‌పై ఆధారపడుతున్నారు. గ్రంథ పఠనంపై ఆసక్తి తగ్గి, సాంఘిక మాధ్యమాలపై అభిరుచి పెరిగి మానసికంగా అనేక కష్టాలు కొనితెచ్చుకుంటున్నారు. గణితంతో పని లేదు. గడియారాల అవసరం లేదు. కాలిక్యులేటర్లకు కూడా కాలం చెల్లింది. క్యాలెండర్లు, కాలిక్యులేటర్లు, సమయం, అలారం.. అన్నీ మొబైల్ ఫోన్లలో నిక్షిప్తం చేయబడ్డాయి. మేధావులకు, లక్షల జీతం ఆర్జిస్తున్న ఉద్యోగులకు సైతం కనీస గణితం రాదు. ప్రతీ చిన్న విషయానికి మొబైల్ ఫోన్లు చూసే అలవాటు ఏర్పడింది. మెదడుకు చురుకుదనం లేదు. మేధస్సుకు పదును పెట్టే అవకాశం లేక మొద్దుబారిన మెదళ్లు తయారవుతున్నాయి. శరీరానికి, మనసుకు ఆరోగ్యాన్ని చేకూర్చే క్రీడలు వీడియో గేమింగ్‌ల ఫలితంగా అంతరించిపోతున్నాయి. ఎక్కడ చూసినా మానసిక అలజడులతో, సంఘర్షణలతో మానవ జీవితం అల్లకల్లోల సాగరంలా మారిపోయింది. సోషల్ మీడియా ప్రభావం యువతను అధోగతి వైపు పయనింపచేస్తున్నది. అరాచకాలు, హత్యలు, లైంగిక హింస సమాజంలో మితిమీరిపోయింది. సాంఘిక మాధ్యమాల ఫలితంగా అశ్లీలత, అసభ్యత జన జీవితాలను ప్రభావితం చేస్తున్నది. చిన్న పిల్లలు సైతం సాంఘిక మాధ్యమాల విష ప్రభావానికిలోనై చెడు దారి పడుతున్నారు. యువతలో పెరిగిన మొబైల్ వ్యాపకం, సోషల్ మీడియా ప్రభావం నైతిక పతనం వైపు పరుగులు పెట్టిస్తున్నది. ఇటీవల కాలంలో జరుగుతున్న అనేక హత్యలకు, అత్యాచార సంఘటనలకు, అసాంఘిక విన్యాసాలకు అనేక వెబ్‌సైట్లు ప్రేరణగా మారిన నిజాన్ని కాదనక తప్పదు. యూట్యూబ్‌లో వెల్లువెత్తుతున్న విచ్చలవిడి అశ్లీలత సమాజాన్ని సర్వనాశనం చేస్తున్నది. చలనచిత్రాల్లో అశ్లీలత నివారించడానికి సెన్సార్ వ్యవస్థ ఉంది. సోషల్ మీడియాలో వస్తున్న అసభ్యతను ఎవరు నియంత్రించగలరు? అలాగే ఇటీవలి కాలంలో మన దేశంలో కూడా పలువురి సోషల్ మీడియా ఎకౌంట్లు సైబర్ నేరగాళ్లకు చిక్కి, ప్రజల గోప్యతకు భంగం ఏర్పడింది. ప్రజల బ్యాంక్ ఎకౌంట్లు, ఆధార్ వంటి వివరాలు, వ్యక్తిగత సమాచారం చోరీకి గురైన మాట వాస్తవం. తెలుగు రాష్ట్రాల్లో కూడా డేటా చౌర్యం జరిగిన విషయం విదితమే. ఇలాంటి సైబర్ నేరాలను అరికట్టడానికి ప్రస్తుతమున్న సైబర్ క్రైమ్ చట్టాలు, పోలీసు వ్యవస్థలు సరిపోతాయా లేదా ఒక్కసారి ఆలోచించాలి. పైగా విదేశాల్లో కూర్చుని మన మొబైల్ ఫోన్లలో సమాచారాన్ని దొంగిలించడం. బ్యాంక్ ఎకౌంట్లను ఖాళీ చేయడం, మన డేటాను చోటీ చేయడం అత్యంత దారుణం. ఇలాంటి చర్యలను అరికట్టడంలో సోషల్ మీడియా యాజమాన్యాలు విఫలం



కావడం బాధాకరం.

భారతీయ సమాజంలో మగువకు విశిష్టమైన స్థానం ఉంది. మగువలను గౌరవించే సమాజంలో నేడు మొబైల్ ఫోన్లలోని సోషల్ మీడియా ప్లాట్ ఫామ్‌లు మగువల స్థానాన్ని దిగజార్చుతున్నాయి. మగువలను నగ్నంగా చూపించి, అనైతికమైన చేష్టలతో యువతను పెడదార్లు పట్టించడం దిగజారిన విలువలకు నిదర్శనం. మరికొంత మంది డబ్బు కోసం యూట్యూబ్ ఛానెళ్లను ప్రవేశపెట్టి, స్త్రీలను అసభ్యకరంగా, అత్యంత జుగుప్సాకరమైన రీతిలో వీడియోలను చిత్రీకరించి, సామాజిక మాధ్యమాల్లోకి వదలడం ద్వారా మనిషి మృగంగా మారే పరిస్థితులను సృష్టిస్తున్నారు. మనిషి జంతువులా బతకాలని ఉపన్యాసాలిచ్చే చీడపురుగులకు పెరుగుతున్న అశ్లీలత వారి మానసిక ఉన్మాదాన్ని చల్లబరచవచ్చేమోగానీ అంతిమంగా సమాజం జంతు ప్రపంచంలోకి జారిపోక తప్పదు. ప్రసార మాధ్యమాలు కూడా అసభ్య చేష్టలకు అత్యంత ప్రాధాన్యత నిస్తూ, నిస్సిగ్గుగా టి.ఆర్.పి. రేటింగ్‌ల కోసం వెంపర్లాడడం మానవుల్లో దాగిన స్వార్థ చింతనను, పైశాచికత్వాన్ని బహిర్గతం చేస్తున్నది. నడుస్తున్న చరిత్రలో మంచి అనేది ఒక చేతగానితనంలా భావించబడుతున్నది. చెడు అత్యంత వేగంగా వ్యాప్తి చెందుతున్నది. ఇందుకు జనబాహుళ్యంలోకి చొచ్చుకు వచ్చిన అనేక మొబైల్ స్మార్ట్ ఫోన్లు అగ్నికి ఆజ్యం పోసిన చందంగా తయారౌతున్నాయి. స్మార్ట్ ఫోన్లను ఎలా వినియోగించుకోవాలో, అలా వినియోగించుకోవడం లేదు. విలాసాలకు, వినోదాలకు, రాజకీయ కార్యకలాపాలకు, శృంగార వీక్షణకు, బెట్టింగులకు వినియోగించుకుంటున్నారు. నిప్పును సక్రమంగా వినియోగించుకునే ఎన్నో ప్రయోజనాలుంటాయి. అదే నిప్పుతో ఎన్నో కొంపలను తగలబెట్టవచ్చు. మంచికి, చెడుకి మధ్యగల సన్నని గీతను మన విచక్షణా పరిధిగా నిర్ణయించుకోవాలి. ప్రస్తుతం మనకు అందుబాటులో ఉన్న సాంకేతిక వ్యవస్థలను, మొబైల్ ఫోన్లను, నిర్మాణాత్మకంగా, సమాజ ప్రగతికి, వ్యక్తిగత అభివృద్ధికి, విద్యకు, ఉపాధికి, ఉన్నతమైన కెరీర్ నిర్మాణానికి సక్రమమైన పద్ధతిలో వినియోగించుకోవచ్చు. అలా కాకుండా దేశం, ప్రపంచం ఏమైనా ఫర్వా లేదు, తమ సరదాలు, తమ ఉన్మాద చేష్టలే తమకు ముఖ్యమని భావించి, ఇదే తరహాలో సామాజిక మాధ్యమాలను దుర్వినియోగపరిస్తే ఇక సమాజంలో మనిషనే జీవి మనుగడ ప్రశ్నార్థకమవుతుంది. మానవ రూప జంతువులు మాత్రమే బాహ్య ప్రపంచాన్ని శాసిస్తాయి.

ఇప్పటికే మానవ సంబంధాలు క్షీణ దశకు చేరుకున్నాయి. మొద్దుబారిన మస్తిష్కాలను సృష్టించకూడదు. విలువలు నశించిన మనుషుల్లా తయారు చేయకూడదు. సాంఘిక మాధ్యమాలు సమాజాభివృద్ధిలో కీలక పాత్ర వహించాలి. సాంఘిక మాధ్యమాల్లో ఇప్పుడు సాగుతున్న ఒరవడిని, సంస్కరించి, వినూత్నమైన, సకారాత్మక ఆలోచనలకు, స్వర్ణభరితమైన నవ ప్రపంచ నిర్మాణానికి వేదికలుగా తీర్చిదిద్దాలి. ❑



# హాయిగా నిద్రపో..

ప్రశాంతమైన నిద్ర ప్రతి మనిషికి అవసరం. అయితే, ప్రపంచంలో నిద్రలేమితో బాధపడేవాళ్లు చాలామందే ఉన్నారు. ఒక్కోసారి చక్కగా నిద్రపట్టడానికి చిట్కాలు పాటించినా ఫలితం ఉండని పరిస్థితి ఉంటుంది. నిద్ర పట్టడం లేదంటూ డాక్టర్ల దగ్గరకు వెళితే యథాలాపంగా నిద్ర మాత్రలు రాస్తారు. నిద్రమాత్రలు వాడితే తాత్కాలికంగా నిద్రపట్టినా, దీర్ఘకాలంలో వాటి దుష్పరిణామాలను ఎదుర్కొని ఇబ్బందిపడక తప్పదు. ఎలాంటి ఇబ్బందులూ లేకుండా హాయిగా నిద్రపట్టేలా చేసేందుకు దక్షిణకొరియా కంపెనీ 'లీసాల్ బ్రెయిన్' ఇటీవల 'స్లీపిసాల్' పేరుతో ఒక హెడ్‌సెట్‌ను అందుబాటు లోకి తెచ్చింది. దీనిని తలకు తొడుక్కుని, మొబైల్‌ఫోన్‌లో దీనికి సంబంధించిన యాప్ ద్వారా యాక్టివేట్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇందులో నాలుగు మోడ్స్ ఉంటాయి. ఇవి స్లీప్‌మోడ్, స్ట్రెస్‌మోడ్, కాన్సంట్రేషన్ మోడ్, రెస్ట్‌మోడ్ కోరుకున్న మోడ్‌ను యాప్ ద్వారా ఎంపిక చేసుకుంటే, ఈ హెడ్‌సెట్ దానికి అనుగుణంగా పనిచేస్తుంది.

# ఎయిర్ కూలర్ కమ్ హీటర్



ఎండాకాలంలో ఎయిర్‌కూలర్, చలికాలంలో రూమ్ హీటర్ వాడుకోవడం మామూలే. ఎండాకాలంలో రూమ్ హీటర్‌ను, చలికాలంలో ఎయిర్ కూలర్‌ను వాడుకోలేం. ఇకపై బయట వేడిగా ఉన్నప్పుడు గదిని చల్లబరచడానికి, చలివణికిస్తున్నప్పుడు గది వెచ్చబరచడానికి వేర్వేరు పరికరాలు వాడుకోనక్కర్లేదు. రెండు సౌకర్యాలూ ఇమిడి ఉన్న పరికరం అందుబాటులోకి వచ్చింది. సింగపూర్ కంపెనీ 'ఎయిర్‌లియో' ఈ డ్యూయో ఎకో మొబైల్ ఎయిర్‌కూలర్ కమ్ హీటర్‌ను రూపొందించింది. ఇది 'లో టెంపరేచర్ ఎవల్యూషనరీ ఓజోన్' టెక్నాలజీ సాయంతో పనిచేస్తుంది. ఇది గది వాతావరణాన్ని 18 డిగ్రీల సెల్సియస్ కంటే తగ్గకుండా, 28 డిగ్రీల సెల్సియస్ కంటే తగ్గకుండా ఉంచుతుంది.

# మల్టీయూజ్ పాడ్



న్యూజీలాండ్‌కు చెందిన పడవల తయారీ కంపెనీ 'డ్రెడ్‌నార్ట్ బోట్స్' ఈ పోర్టబుల్ మల్టీయూజ్‌పాడ్‌ను రూపొందించింది. చూడటానికి ఇది ఏదో విచిత్ర గ్రహాంతర వాహనంలా కనిపిస్తుంది గాని, ఇది ఉభయచర వాహనం. నేలమీద, నీటి మీద ప్రయాణించగలిగే ఈ వాహనాన్ని 'డ్రెడ్‌నార్ట్ బోట్స్' నిపుణులు సునామీలను దృష్టిలో ఉంచుకుని రూపొందించారు. ఈ వాహనం కిటికీలకు దృఢమైన అద్దాలు, మిగిలిన భాగాలను భారీ నౌకల తయారీకి ఉపయోగించే నాణ్యమైన అల్యూమినియం ఉపయోగించారు. వాహనం లోపల విశాలమైన స్థలం, వాహనంలోనే వివిధ పరికరాలను చార్జ్ చేసుకునేందుకు వీలుగా 350 వాట్స్ సామర్థ్యం గల ఇన్వర్టర్ వంటివి ఏర్పాటు చేశారు. వాహనం పైభాగంలో అమర్చిన సోలార్ ప్యానెల్స్ ద్వారా ఇది పూర్తిగా సౌరవిద్యుత్తుతో నడుస్తుంది.

మొబైల్ పక్కన పెట్టు/ ఒకరి ముఖంలో ఒకరం
నేరుగా చూసుకుని ఎన్నాళ్లు అయ్యిందో
ఎప్పుడూ లెక్కలేనా/ వన్ బై టూ టీ తాగుతూ
వెన్నెలలో వేటూరి డ్యూయట్లు విందాం
గొడుగు విసిరేయ్/ దేహం దాహం తీర్చాలి
వర్షంలో ఆశల పడవల్ని వదులుదాం.
అమెజాన్‌లో మజా లేదు/ ప్రేక్షకులు లేని థియేటర్‌లో
పాత బాకీలు తీర్చుకుందాము పద
చికాకులు నిషేధం/ చిన్ని చిన్ని పెదవుల్లో
అమృతం తోడాల్సి వుంది ఇంకా.
ఎప్పుడూ మెటీరియల్ లోకమేనా
ఒక్క పొద్దు(నాతో) జీవించలేవా
మనసు ఎక్కడ పోగొట్టుకున్నావురా..

**- దాసరి మోహన్**



# మనసు ఎక్కడ పోగొట్టుకున్నావు?

## ఈవారం కవిత్వం

## అనితరసాధ్యం

ఓ మహాకవీ శ్రీశ్రీ..
శ్రామికుడే దేవుడన్నది వాదంగా
స్వేదమే నీ వేదంగా చేసుకొని,
కర్షక స్వేదాన్ని సిరాచుక్కలతో
కలిపి అగ్గి రాజేసి,
సామాన్యులకు కలంతో
అండగా నిలిచి,
అణ్వాస్త్రాలు కాదు, అన్నవస్త్రాలు
ముఖ్యమని చాటి చెప్పిన
నీలో కదిలే నవ్య కవిత్వం
శ్రామిక లోకానికి అంకితమన్నావు.
స్టెతస్కోపు కన్నా మిన్నగా
జనం వేదనని వినే కలంపట్టి,
కన్నీటికి ఉప్పెన రూపాన్నిచ్చిన
నీ అక్షరాలు ఆశావాదానికి కళ్లు,
పురోగామి భావాలకు కాళ్లు.
నీ కవితలు సామాజిక స్పృహకు బలం,
సాహితీప్రియ భావుకులకు ఆలవాలం.
ప్రతీ కవితను విప్లవ కేతనంగా మార్చిన
రెండక్షరాలు నీవంటే
లోతు, ఎత్తు, అగ్ని, ఒదార్పు, ఓ నేత.
కాలం నాడి తెలిసిన మహాకవివి నీవు.
దగాపడిన వారందరిదీ నీ కవిత్వం.

**- వేమూరి శ్రీనివాస్**



## పరివర్తన!

అదేంటో అద్భుతం
ఆ సంస్కారం
ఆ పరివర్తన
ఆ రూపాంతరం!
ఆకారం మార్చుకోవాలనీ
పరివర్తన పొందాలనీ
సమయం ఆసన్నమైందనీ
ప్రేరణకు అంకురమెప్పుడో!
ఆ తపస్సు కఠోర అకుంఠిత దీక్ష
దోషాలేవో వదిలెయ్యాలనీ
కొత్త వర్ణాలేవో పొందాలనీ
గొంగళిపురుగు సీతాకోకగా!
అలా పరివర్తనకో ప్రేరణ
అలా తపస్సుకి ధైర్యం
అలా జన్మ సంస్కారం
మనకీ వస్తే బాగుండు!

**- రవికిషోర్ పెంట్రాల**

## తను-నేను-మౌనం

**ఆమె** ఒక మొక్కను తెచ్చి/ నాటింది నాలో..
యుగయుగాల నాటి మౌనం అది!
కాలపు సుగంధ స్వర లయలన్నీ
మోగుతున్నాయి నాలో..
అందించా నా మౌన ప్రేమ పుష్పాన్ని తనకి
విశ్వమంతటా వికసించింది ఆమె!
ఇరువురం/ ఒకరి భుజం మీద ఒకరం
మా మనసులను వేసుకుని
ఇప్పుడు నడుస్తున్నాం.

**- ఎ.మురళీధరరావు**

# పుస్తక సమీక్ష

## కవులకు పండుగ..గుదిబండి జన్మదినం



'పుట్టిన రోజు పండగే అందరికీ..మరి పుట్టిందీ ఎందుకో తెలిసేది ఎందరికీ?' అన్నారు మహాకవి సినారె. జీవీఆర్ సంస్థాధినేత గుదిబండి వెంకటరెడ్డి గత తొమ్మిది సంవత్సరాలుగా ప్రతిఏటా తన పుట్టినరోజున ఓ కవితాసంకలనం వెలువరించే సంప్రదాయాన్ని పాటిస్తూ ఈ సంవత్సరం 'తోబుట్టువులు' శీర్షికన 82మంది కవులతో కవితలు రాయించి ఓ సంపుటిని ప్రకటించారు. ఆయన స్వతహాగా కవి కాకపోయినా కవిత్వాభిమాని. కవులను ప్రోత్సహిస్తూ, వారిని సత్కరిస్తూ తన జన్మదినాన్ని చిరస్మరణీయం చేసుకుంటున్నారు. వివిధరంగాల లోని కళాకారులకు పురస్కారాలుయిస్తు, సింహాభాగం పెన్షన్ డబ్బులను వెచ్చిస్తూ సంవత్సరం పొడవునా ఏదో సాహిత్య, సాంస్కృతిక, సామాజిక కార్యక్రమం దిగ్విజయంగా నిర్వహించడం ఆయన నిత్యకృత్యం. వితరణశీలిగా, కళాపోషకుడిగా నిత్య చైతన్యంతో తన విశ్రాంత జీవితం గడుపుతున్న 82 సంవత్సరాల గదిబండి స్ఫూర్తిదాయక ప్రస్థానం ఎంతైనా ప్రశంసనీయం. తోబుట్టువులు పరస్పరం ఆప్యాయానురాగాలతో ఒకరికి దండుగా మరొకరు నిలబడాల్సిన అవసరాన్ని చాలా కవితల్లో ప్రస్తావించారు కవయిత్రులు, కవులు. యిందలి కవితలు చదవండి..జీవితపు విలువలు కొన్నైనా తెలుస్తాయి. **(తోబుట్టువులు, రచన: గుదిబండి వెంకటరెడ్డి, వెల: రూ 100, ప్రతులకు: ఇం.నం.బి 70/ఎఫ్1, పి.ఎస్.నగర్, విజయనగర్‌కాలనీ, హైదరాబాద్)**

**- రమణ వెలమకన్ని**


## నవ్వించే నటవీరులు



రచయిత, సినీ నిర్మాత, దర్శకుడు డా॥నిట్టల గోపాలకృష్ణ 108మంది హాస్యనటులను ఫొటోలతో సేకరించి నవ్వించే నటవీరులు ఆకర్షవంతంగా వెలువరించారు. నాడు రేలంగి, రమణారెడ్డి, పద్మనాభం, గిరిజ, చలం, రాజబాబు వంటి సుప్రసిద్ధులు నేటి రాజేంద్రప్రసాద్, రమాప్రభ, బ్రహ్మానందం, ఆలీ, ఏవీఎస్ తెలుగు చలనచిత్ర సీమలోని శతాధిక హాస్యనటుల జీవిత విశేషాలను ఎంతో ప్రయాసతో అందించటం, అరవై సంవత్సరాలుగా చిత్రపరిశ్రమతో సత్సంబంధ సాన్నిహిత్యం వున్నందున డా॥గోపాలకృష్ణకు విజయవంతమైంది. హాస్యబ్రహ్మ పద్మశ్రీ బ్రహ్మానందంకి అంకితమిచ్చిన ఈ రచనలో, లంకసత్యం నుంచి కృష్ణుడు వరకు వారి జీవితవిశేషాలతో పుట్టిన రోజు, నటించిన సినిమాల పేర్లు, ప్రతిభావిశేషాలు ఆసక్తికరంగా వివరించారు. హాస్య నటులు లేనిదే ఏ చిత్రం విజయవంతం కాదు. తెలుగు చిత్రసీమలో హీరోలు హాస్యనటులుగా చెలామణీ అయిన కథనాలున్నట్టే, యువ హాస్యనటు లు హీరోలుగా ప్రేక్షకుల మన్ననలు పొందుతున్నారు. మహిళా నటీమణు లను డా॥ గోపాలకృష్ణ ఎంతో శ్రద్ధాసక్తులతో ప్రోత్సహించటం అభినందనీయం. **(నవ్వించే నటవీరులు, రచన: గోపాలకృష్ణ, వెల: 100, ప్రతులకు, గోమాత సేవాట్రస్ట్, 202, రామంత్‌పూర్, హైదరాబాద్)**

**యర్రమిల్లి**


## రైతుల బాధల్ని తెలిపే పుస్తకం



పద్య కవిత్వాన్ని సామాజిక పరం చేసిన వేణుశ్రీ 'తాత మాటలు కైరవా, తరగని నిధి' అనే మకుటంతో శతకసాంప్రదాయాన్ని పాటిస్తూ సీసం, తేటగీతి ఛందస్సులతో దాదాపు 121 పద్యాలు వేణుశ్రీ యీ శతక సంపుటిలో రాసారు. పద్మశ్రీ భాష్యం విజయసారథి, బ్రహ్మానందరావు, నందిని సిద్ధారెడ్డి, అమ్మంగి వేణుగోపాల్, గంగ్ర లక్ష్మణరావు, బెల్లంకొండ సంపత్‌కుమార్, రూప్‌కుమార్ డబ్బీ, సరిపెల్లి కృష్ణారెడ్డి, కందుకూరి శ్రీరాములు, టి.రంగస్వామి, సముద్రాల వేణుగోపాలాచార్య, డి.రాజారాం మోహన్, కూకట్ల తిరుపతి, మార్గం కృష్ణమూర్తి చక్కటి విలువైన ముందుమాటలు రాసారు. కవి తన శ్రీమతికి రాజమణికి ఈ పుస్తకం అంకితం చేసారు. నేటి సమాజంలో మనిషి విలువలు, ప్రేమలు, వృత్తికులాలు పడే ఇబ్బందులు ప్రపంచీకరణ, వ్యాపార సంస్కృతి నేటి రాజకీయ పార్టీల తీరుతెన్నులు..రైతుల పోరాటం, రైతుల బాధలు, ఛిద్రమౌతున్న పల్లెసీమలు ప్రకృతి పర్యావరణం ఇలా నేటి సమాజ జీవనాన్ని దర్పణంగా ఒక్కొక్క పద్యంలో రాసారు. ఉపాధ్యాయవృత్తిలో తన అనుభవాన్ని శతకం ద్వారా చెప్పారు. సీసపద్యాలు పాఠకుల్ని అలరిస్తాయి. వీరి లేఖిని నుండి ప్రజారంజక సాంఘిక అంశాలతో కూడిన పద్యాలు శతకాలు రావాలని ఆశిస్తూ అభినందనలతో. **(కైరవ శతకము, రచన: వేణుశ్రీ, వెల: రూ 65, ప్రతులకు: విశాలాంధ్ర, బుక్‌హౌస్)**

**- తంగిరాల చక్రవర్తి**

## అందరినీ అలరించే కథలు



పిల్లలను సన్మార్గంలో పెట్టడానికి వారికి చిన్నతనం నుంచే మంచి బుద్ధులు నేర్పాలి. మంచి అలవాట్లు అలవరచుకోవటానికి వారికి శిక్షణ ఇవ్వాలి. మొక్కయివంగనిది మాను అయి వంగదు. బాల్యం నుండే పిల్లలకు సాహిత్యం మీద అభిరుచి కలిగించాలి. నీతికథలు చెప్పాలి. కొంచెం పెరిగి చదువుకునే వయసు వచ్చాక వారికి మంచి బొమ్మలున్న నీతికథల పుస్తకాలు అందుబాటులో వుంచాలి. భాషసరళంగా ఉండాలి. నేటి దిన, వారపత్రికలు ఈ దిశగా కృషి చేస్తోండటం అభినందనీయం. రాచకొండ చెంగల్రాజు కృష్ణస్వామిరాజు సాహిత్యలోకంలో 'ఆర్.సి.కృష్ణస్వామిరాజు'గా సుప్రసిద్ధుడు. విరివిగా కథలు రాస్తారు. రాయలసీమ యాసకు, భాషకు, గౌరవం కల్పిస్తాడు. కథల్లో అంతర్లీనంగా ప్రవహించే హాస్యం ముచ్చటగొలుపుతుంది. బాలసాహిత్య రచనా కృషిలో భాగంగా, లోగడ రాజు కథలు, రాణిగారి కథలు రాసారు. బాలల కథల్లో భాగంగా ఈ 'కార్వేటినగరం కథలు' తెలుగు బాలలకు అందిస్తున్నారు. ఇందులో 30 కథలున్నాయి. రాజులు, రాజ్యాలు కోటలు, బడికి వెళ్లే వయసున్న పిల్లలు,పక్షులు, చెట్టూ చేమా, వీరి కథల్లోని పాత్రలు. పిల్లలకే కాదు పెద్దలకూ నచ్చుతాయీ కథలు. **(కార్వేటి నగరం కథలు, రచన: ఆర్.సి.కృష్ణస్వామిరాజు, వెల: రూ 140, ప్రతులకు: బ్యాంక్ ఎంప్లాయిస్ కాలనీ, తిరుపతి) - కూర చిదంబరం**



# నవ్వుతూ జీవిద్దాం

**ఒక** బోసి నవ్వు చందమామకంటే అందంగా ఉంటుంది అంటారు కవులు. ఒకసారి నవ్వితే రెండువేల చాక్లెట్లు తిన్నంత ఆనందం, పదిహేను లక్షలు పొందినంత సంతోషం కలుగుతుందని బ్రిటిష్ పరిశోధనల్లో వెల్లడయ్యింది. తరచు తనివితీరా నవ్వేవారి ఆయుష్షు 7.2 సంవత్సరాలు పెరుగుతుందని సర్వేలు తేల్చాయి. నవ్వువల్ల మానసికి శక్తిమెరుగుపడుతుందని ప్రముఖ మనోవిశ్లేషకుడు సిగ్మండ్ ఫ్రాయిడ్ తన ఉపశమన సిద్ధాంతంలో పేర్కొన్నారు. నవ్వు మానవ జీవసంబంధ మూలాలు కలిగి ఉంటుందని ప్రముఖ తత్వవేత్త జాన్‌మోర్రియల్ పేర్కొన్నారు. అందుకే నవ్వించడం ఒక యోగం, నవ్వడం బోగం, నవ్వకపోవడం రోగం అంటారు. ఇంతటి విలువైన నవ్వు ఆధునిక జీవనంలో క్రమంగా కనుమరుగైపోతున్నది. బ్రతుకు బరువు-నవ్వు కరువు, మనసుభారం, నవ్వుమాయం అన్నట్టు పరిస్థితులు మారిపోతున్నాయి. సహజసిద్ధమైన నవ్వు తెప్పించడానికి, నవ్వుకోవడానికి ప్రత్యేకంగా నవ్వుల క్లబ్బులు వెలుస్తున్నాయి. డబ్బు సంపాదన ప్రధానంగా భావించిన పలువురు పరుగులు తీస్తూ నవ్వుకు దూరమవుతున్నారు. జీవితాన్ని సమరంగా మార్చుకుని మానసిక ఒత్తిళ్లను నెత్తికెత్తు కుంటున్నారు. సుఖం, సంతోషాలకు దూరమవుతున్నారు. చిన్నవయసులోనే మానసిక, శారీరక రుగ్మతలను మూటకట్టు కుంటున్నారు. యవ్వనంలో సంపాదించిన డబ్బు వృద్ధాప్యంలో ముసురుకునే రుగ్మతలకు ఖర్చు చేస్తున్నారు. బ్రతుకుభారమై గుండె బరువు ఎక్కినప్పుడు నవ్వు విలువ తెలుసుకుంటున్నారు. నవ్వు కోసం, నవ్వించే వారి కోసం, నవ్వుల కోసం వెదుకులాడుతున్నారు. పూర్వపు రోజుల్లో బాల్యం ఆటలు, పాటలు, నవ్వులు, కేరింతలతో గడిచిపోయేది. ఇప్పుడు పుస్తకాల బరువు, ర్యాంకుల దరువు మధ్య నవ్వుముఖం చూడకుండా ముఖంపై నవ్వకనిపించకుండానే తెల్లారిపోతోంది. అందుకే ఇప్పుడు నవ్వు విలువ లోకానికి తెలియచెప్పేందుకు ప్రపంచ నవ్వుల దినోత్సవం జరుపుకుంటున్నాం. అందుకే నవ్వు విలువ తెలుసుకుని ప్రతినిత్యం మనస్ఫూర్తిగా నవ్వడానికి ప్రయత్నిద్దాం.

### విలువ కట్టలేని నవ్వు

నవ్వుకు విలువ కట్టలేం. ఎన్నో ప్రయోజనాలు ఉన్న నవ్వు విలువ కట్టడం అంటే ఆకాశానికి హద్దులు వెదకడం అంటారు. అయినా నవ్వడానికి మాత్రం పైసా ఖర్చుపెట్టవలసిన పనిలేదు. మానవ సంబంధాలు పెంచుకుని, మనసులు కలబోసుకుని సరదాగా గడిపితే చాలు. ఇంట్లో అందరూ కలసి కబుర్లు చెప్పుకుంటే నవ్వులు వెల్లివిరుస్తాయి. సినిమాల్లో హాస్యసంఘటనలు చూసినా, జోకులు చదివినా నవ్వు పుడుతుంది. ఎలా నవ్వినా, ఎప్పుడు నవ్వినా, ఎందుకు నవ్వినా నవ్వు మాత్రం టానిక్కులా పనిచేస్తుంది. ఎన్నో ప్రయోజనాలు, ఫలితాలను అందిస్తుంది. ఆధునిక సమాజంలో మానసిక ఒత్తిడి పెద్దసమస్యగా మారింది. ఒత్తిడిని తగ్గించడంలో లేదా ఉపశమనం కలిగించడంలో మానసిక ఒత్తిడి పెద్ద సమస్యగా మారింది. ఒత్తిడిని తగ్గించడంలో లేదా ఉపశమనం కలిగించడంలో నవ్వు దివౌష్యధంలా పనిచేస్తుంది. దీనికి కారణం నవ్వినప్పుడు శరీరంలో విడుదల అయ్యే సానుకూల రసాయనాలు (హార్మోన్లు) అంటారు డాక్టర్లు, మానసిక నిపుణులు. కారణం ఏదైనప్పటికి ఒత్తిడి కలిగినప్పుడు శరీరంలో అడ్రినలిన్, కార్టిసాల్ ఇతర ప్రతికూల హార్మోన్ల విడుదల అవుతాయి. దీనివల్ల నాడీవ్యవస్థ ప్రతికూల స్పందనలకు గురవుతుంది. దీంతో శ్వసప్రక్రియ, గుండెవేగం పెరుగుతాయి. మనసులో అలజడి, ఆందోళన, వ్యాకులత కలుగుతుంది. కోపం, ఆవేశం, చిరాకు, నిరాశ, నిస్పృహ తలెత్తుతాయి. అయితే ప్రతి రోజూ ఏదో ఒక సందర్భంలో అప్పుడప్పుడు నవ్వుతుంటే ఒత్తిడి నుండి ఉపశమనం కలుగుతుంది. నవ్వినప్పుడు శరీరంలో సానుకూల రసాయనాలైన పెరటోనిన్, దోపమైన్, ఎండార్ఫిన్లు విడుదల అవుతాయి. స్నేహితులు, హితులు, సన్నిహితులు, బంధువులతో కలిసి నవ్వుకుంటే వీటితోపాటు ఆక్సిటోసిన్ కూడా విడుదల అవుతుంది. ఈ రసాయనాలను 'ఫీల్‌గుడ్' హార్మోర్లు అంటారు. ఈ రసాయనాలు విడుదల కావడంతో ప్రికూల రసాయనాల ప్రభావం పలుచబడుతుంది. ఉత్సాహం, ఉల్లాసం స్వంతమవుతుంది. నాడీవ్యవస్థ చైతన్యమవుతుంది. మనసు కుదుట పడుతుంది. గుండె, ఊపిరితిత్తులు బలపడతాయి.

**డాక్టర్ ఎన్.బి.సుధాకర్‌రెడ్డి**



విలువకట్టలేని నవ్వుల పంట సాగుచేయడానికి, స్వంతం చేసుకోవడానికి అందరం కృషి చేద్దాం.

**హాస్యం పండిద్దాం**

నవ్వు ఊరకనే రాదు. దానికి ఒక సందర్భం, మూలం లేదా కారణం ఉండాలి. సహజంగా సంభాషణలో హాస్యం దొర్లితే నవ్వువస్తుంది. సమయస్ఫూర్తి, శ్లేష, ఉత్ప్రేక్ష, అతిశయోక్తి, చలోక్తి, వ్యంగ్యం, నర్మగర్భమైన విమరశలు చోటుచేసుకున్నప్పుడు హాస్యం ఉద్భవిస్తుంది. ఇవన్నీ సంభాషణల్లోనే కాదు, ఉపన్యాసాలు, సినిమాలు, సీరియళ్లు, కథలు, కార్టున్లలో దర్శనమిస్తుంటాయి. అయితే హాస్యం పుట్టేలా మాట్లాడం లేదా రాయడం ఒక కళ. సృజనాత్మకంగా ఆలోచించగల వారు మాత్రమే హాస్యం పండించగలరు. అలాగే అందులో భాగం అర్థమయినప్పుడే నవ్వగలం. కొందరు ఎప్పుడు పడితే అప్పుడు అకారణంగా నవ్వుతుంటారు. ఒంటరిగా కూర్చోని ఎటో చూసి వెర్రినవ్వులు చిందిస్తుంటారు. ఇలాంటి వారిని పరిశీలిస్తే వారిలో ఏదో ఒక మానసిక సమస్య ఉందని అర్థం అవుతుంది. తీవ్రమైన డిప్రెషన్‌కు లోనైనవారిని నవ్వించడం చాలాకష్టం. వారు సంతోషం, ఆనందం కలిగించే అంశాలు పరిస్థితులకు సరిగా స్పందించరు. స్కిజోఫ్రెనియా, మానియా, బైపోలార్ డిజార్డర్‌లాంటి రుగ్మతలతో బాధపడేవారు అకారణంగా నవ్వుతుంటారు. అందుకే ఇలాంటి వారిని అందరినీ పరిశీలించిన సృజన భావకులు నవ్వించడం ఒక యోగం, నవ్వడం భోగం, నవ్వకపోవడం రోగం అన్నారు. అలాగే నవ్వగలిగే మానసికస్థితి ఉన్నవారిని భోగలాలసలుగా చెప్పవచ్చు. ఇక్కడ భోగం అంటే సంతోషం, ఆనందం అన్నకోణంలో మాత్రమే చూడాలి. ఇక ఎట్టి పరిస్థితులలోను నవ్వనివారిలో ఏదో ఒక మానసిక సమస్య ఉన్నట్టు భావించాలి. అయితే హాస్యం కోసం ఇతరులను అవహేళన చేయడం, వ్యంగబాణాలు సందించడం మంచిది కాదు. ఇలాంటి నవ్వులు వికటించినపుడు నవ్వించబోయి నవ్వులపాలు కావలసివస్తుందన్న విషయం గుర్తించాలి. సుదీర్ఘ ఉపన్యాసాలు ఇచ్చేవారు శ్రోతలను ఆకట్టుకోవడానికి హాస్యం పండించక తప్పదు. సినిమాలు, సీరియళ్లు కథల్లో హాస్య సంఘటనలు చొప్పిస్తుంటారు. అందుకే నవరసాలు అయిన శృంగారం, వీరం, కరణ, అద్భుతం. హాస్యం, భయానకం, బీభత్సం, రౌద్రం, శాంతం ఉన్నప్పుడే కథనం రక్తికడుతుందంటారు. ఈ నవరసాలలో హాస్యానికే ఎక్కువ ప్రాధ్యాత ఉంటుంది అనడంలో అతిశయోక్తి లేదు. శ్రీకృష్ణదేవరాయులు కొలువులో అష్టదిగ్గజాలు పేరుతో ఎనిమిది మంది కవులు ఉన్నప్పటికి వారిలో తెనాలి రామలింగ కవికి ఆదరణ ఎక్కువ. పిల్లలు, పెద్దలను అష్టదిగ్గజాల పేర్లు అడిగితే అందరిపేర్లు చెప్పలేకపోయినా తెనాలి రామలింగ కవి పేరు తప్పకుండా చెబుతారు. అంటే ఆయన ఎక్కువగా హాస్యం పండించడమే ఇందుకు కారణం. మన సినిమాలో హీరోలు, హీరోయిన్లతో సమానంగా హాస్యనటులకు ప్రాధాన్యత ఉన్న విషయం కాదనలేం. చాలా గొప్ప ఉపన్యాసకులుగా పేరు పొందిన ఆధ్యాత్మిక



గురువులు, వ్యక్తిత్వ వికాస శిక్షకులు, హరికథ, బుర్రకథ చెప్పేవారు. తమ చతురతతో హాస్యాన్ని పండించి శ్రోతలను ఆకట్టుకుంటుంటారు. మంచి రచయితలు కూడా పాఠకులను ఆకట్టుకోవడానికి హాస్యసంఘటనలు, ఆసక్తికర అంశాలను రాస్తుంటారు. పత్రికల్లో కార్టూన్లు వేసి ప్రసిద్ధులైన వారికి ప్రపంచవ్యాప్తంగా చూడవచ్చు. చిన్న బొమ్మ, వీలైతే నాలుగు మాటలు రాసి చాలాలోతైన అర్థాన్ని లేదా భావాన్ని అర్థమయ్యేలా చెబుతుంటారు. కాబట్టి సమాజంలో రాణించాలని భావించే వారు హాస్యం పండించడానికి అనువైన నైపుణ్యం అలవర్చుకోవాలి. దీనికి జ్ఞానం, అనుభవం, సామాజిక స్పృహ, సృజనాత్మక శక్తి, భాషపై పట్టు, పదప్రయోగంలో చతురత పెంపొందించుకోవాలి. అలాగే తమతమ బేధాలు మరచిహాయిగా నవ్వుకోవడానికి మనసును సిద్ధపరచాలి. నలుగురితో కలిసిమెలిసి ఉండేందుకు సంసిద్ధం కావాలి. నవ్వరానివారు, నవ్వలేనివారు మాత్రం సైకాలజిస్టులను కలిస్తే మంచిది.

**అనుబంధమే ఆనందం**


మనిషి సామాజిక జీవి అంటారు సామాజికవేత్తలు. సమాజంలో సంతోషం, ఆనందం స్వంతం చేసుకోవాలంటే మానవ సంబంధాలే మూలం ఎంత సంపాదించినప్పటికి, ఎంత ఎదిగినప్పటికి అనుబంధాలు ఉన్నప్పుడే ఆనందం స్వంతమవుతుంది. ప్రతి మనిషి ప్రేమ, అనురాగం, ఆప్యాయత, అనురాగం, ప్రశంస, గౌరవం, మర్యాద, ఆదరణ కోరుకుంటారు. ఇవేవీ లేని జీవితాలు వాసన లేని పువ్వుల్లా మిగిలిపోతారు. కాబట్టి ప్రతివ్యక్తి డబ్బు సంపాదనతోపాటు తన సంతోషం కోసం రోజూ కొద్ది సమయం కేటాయించుకోవాలి. తెలివైనవారైతే ప్రతి పనిలోను, ప్రతి చోట మానవ సంబంధాలు మెరుగుపరచుకోవాలి. అందరితో కలిసిమెలసి పనిచేస్తూ సరదాలను మూటకట్టుకోవచ్చు. పల్లెల్లో పొలం పనులు చేసేవారు పాటలు పాడుకుంటూ కబుర్లు చెప్పుకుంటూ అలసట తెలియకుండా ఆనందంగా ఉంటారు. అయితే మేధావులం అనుకునే కొందరు తమకు తాము గొప్పదనాన్ని ఊహించుకుని బిగుసుకుపోతుంటారు. అహంతో అందరిని తక్కువగా భావిస్తుంటారు. పక్క వారితో మాట్లాడితే తమ హోదాకు భంగమని భావిస్తుంటారు. మానవ సంబంధాలు, అనుబంధాలను పట్టించుకోకి వారిలో మానసిక ఒత్తిళ్లు ఎక్కువగా ఉంటాయని నిపుణులు అంటుంటారు. నలుగురితో మాటలు కలపలేని వారు సరదాగా నవ్వలేని వారు ఎక్కువగా శారీరక రుగ్మతలకు గురవుతుంటారు. భావాలు పంచుకుంటే బాధలు తగ్గుతాయన్న స్పృహ ఇలాంటి వారిలో కనిపించదు. ఆధునిక సమాజంలో చాలామంది యాంత్రిక జీవనానికి అలవాటు పడుతున్నారు. కుటుంబ సంబంధాలు అనుబంధాలను పట్టించుకోవడం లేదు. దంపతులు, తల్లిదండ్రులు, పిల్లలు కలిసి కబుర్లు చెప్పుకోవడం బాగా తగ్గిపోయింది. ఒకవేళ మాట్లాడవలసి వస్తే ముక్తసరిగా మాట్లాడం, తమ గొప్పలు చెప్పుకోవడంతో సరిపెట్టుకుంటున్నారు. అహం వీడి అనుబంధాలు పెంచుకోవాలి. నవ్వుతూ బతకాలి, నవ్వుతూ తనువు చాలించాలి.మనం పోయినా మనం పండించిన నవ్వులు విస్తరించాలి. అందరి జీవితాలు ఆనందమయం కావాలి. అందుకే నవ్వుకు విలువనిద్దాం., నవ్విద్దాం, నవ్వుతూ జీవిద్దాం. ❑





కథ

# రంగుల మోసం



ఓ అపార్ట్‌మెంట్ చుట్టూ ఉన్న తోటలో కొన్ని అందమైన పిల్ల సీతాకోక చిలుకలు ఉండేవి. వాటిలో ఓ చురుకైనది అపార్ట్‌మెంట్‌లో కొత్తగా ప్రారంభించిన బ్యూటీపార్లర్‌లోకి తొంగి చూసింది. అక్కడికి ఎంతోమంది అమ్మాయిలు వచ్చి అందంగా తయారై వెళ్లడం గమనించింది. ఆ విషయాన్ని తన తోటి స్నేహితురాళ్లకు చెప్పింది. అన్నీ గుంపుగా వెళ్లి, అమ్మాయిలు రంగులేసుకోవడం చూసి 'భలేభలే' అనుకున్నాయి. మనం కూడా రంగులేసుకుంటే ఎలా ఉంటుందని ఊహించాయి. 'మధ్యాహ్నం పార్లర్ మూసేశాక ఎవ్వరూ ఉండరు, మనం వెళ్లి, నచ్చిన రంగు పూసుకోవచ్చు' అని ఆలోచించాయి. అనుకున్నదే తడవు, వెంటనే అమలు చేశాయి. పిల్ల సీతాకోక చిలుకల్లో ఏదో తేడా కనబడుతోందని వాటి పెద్దలు గుర్తించి ఓ రోజు వాటిని నిలదీశాయి.

'మీది పాతతరం. మీలాగే ఉంటే మేం ఎగబడలేం. ఆధునిక పద్ధతుల్ని మేం అనుసరిస్తేనే మాకు మనుగడ' అని పిల్ల సీతాకోకచిలుకలు ఎదురుతిరిగాయి.

అయినా పెద్దతరం సీతాకోక చిలుకలు అన్నిటినీ కూర్చోబెట్టి ఇలా హితబోధ చేశాయి. 'అందరూ అసహించ్యుకునే గొంగళి పురుగుల నుంచి మనం అందమైన జీవాలుగా మారాము. ప్రకృతి మనకు ఇచ్చినన్ని అందాలు వేరే కీటకాలకు ఇవ్వలేదు. సహజంగా ఉండక కృత్రిమ రంగులను ఎందుకు ఆశ్రయిస్తారు? మనం మనంగా ఉందాం. మనుషులను అనుకరించాల్సిన అవసరం లేదు. వారి జీవన విధానం మనది వేరువేరే' అని.

ఆ మాటలను పిల్ల సీతాకోక చిలుకలు చెవిన వేసుకోలేదు. 'మనం అందంగా తయారవుతున్నామని వాళ్లకు కుళ్లు. అందుకే అడుగడుగునా అడ్డు పడుతున్నారు' అని తిట్టుకున్నాయి. 'ఎలాగూ పెద్దలకు తెలిసిపోయింది కదా' అని రోజుకో కొత్తరకం రంగులేసుకుని ఊరేగేవి.

దూరంగా ఉన్న మామిడి తోటకి వెళ్లి అక్కడి సీతాకోక చిలుకల ముందు 'బడాయి' పోయేవి.

మా అందం ముందు ఎవ్వరూ సరితూగలేరని వాటిని రెచ్చగొట్టేవి. మీకు కూడా రంగుల రహస్యం చెబుతామని వాటి వద్ద ఉన్న తేనెను తాగేసేవి.

మామిడితోట సీతాకోక చిలుకలు వీటి వేషధారణ చూసి ఆశ్చర్యపోయేవి, తమకన్నా గొప్పవని, అందుకే కొత్తకొత్త రంగులతో ఆకర్షణీయంగా ఉన్నాయని భావించేవి.

అలా ఓ రోజు గొప్పలు పోతుండగా జోరున వర్షం కురిసింది. చెట్ల చాటున దాక్కొన్నా, వర్షం ధాటికి అవి బాగా తడిసిపోయాయి. వేసుకున్న రంగులన్నీ తుడుచుకుపోయాయి. అసలు స్వరూపం బయటపడింది. దాంతోపాటు కృత్రిమ రంగులు వాడి ఉండటం వల్ల సహజమైన కాంతి, మెరుపు, అందం కోల్పోయి అసహ్యంగా కనిపించ సాగాయి. రసాయనాల ప్రభావం వల్ల కొన్నిటి రెక్కలు మడతపడటం కూడా జరిగింది.

వర్షం నిలిచిన తర్వాత మామిడితోట సీతాకోక చిలుకలన్నీ చాటు నుంచి బయటికి వచ్చాయి. మిత్రులుగా వచ్చిన వాటి రంగుల మోసం కనిపెట్టేశాయి. వాటికి బుద్ధి చెప్పాలని పక్కనే తాటితోపులో ఉన్న తేనెటీగలకు విషయం చెప్పాయి. తేనెటీగలన్నీ మూకుమ్మడిగా వాటిపై దాడి చేసి ఒకటికి రెండుసార్లు కుట్టాయి. అన్ని పిల్ల సీతాకోక చిలుకలూ ఏడ్చుకుంటూ తమ సొంత అపార్ట్‌మెంట్‌కు వచ్చి చేరాయి. 'తప్పు తెలుసుకున్నామని, ఇంకెప్పుడూ పైపై మెరుగుల కోసం ప్రాకులాడమని' పెద్దలకు చెప్పాయి.

సంతోషించిన పెద్దతరం, పిల్ల సీతాకోకచిలుకలన్నిటినీ, పక్కనే ఉన్న గులాబీ తోటలోకి తీసుకెళ్లి మధురాతిమధురమైన మకరందాన్ని తాగించాయి.

**- ఆర్.సి.కృష్ణస్వామిరాజు**







# తెలుగు వాకిలి పిల్లల వెన్నెల

వార్త ఆదివారం

## బాలగేయం

### సెలవుల్లో హాయ్‌గా

వేసవి సెలవులు
వచ్చాయండి
పరీక్షలు
బాగా రాశామండి
అమ్మమ్మ వాళ్లూరికి
వెళ్లామండి
తియ్యని మామిడిపండ్లు
తిన్నామండి
తాతయ్య
తెచ్చిన చల్లని
తాటి ముంజలు
తిన్నామండి
అమ్మమ్మ చెప్పిన
నీతికథలు విన్నామండి
మామయ్య చెప్పిన
తమాషా కథలు
విన్నామండి
పరీక్షాఫలితాలు
వచ్చాయండి
మంచిమార్కులతో
పాసయ్యామండి
అమ్మానాన్నలు
సంతోషించారండి
సెలవుల్లో
హాయ్..హాయ్‌గా
గడిపేద్దాం

**-సి.జయచంద్రారెడ్డి**

## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**

**గిరీష్ అంకుల్ సమాధానాలు**

**- ఎస్.వసుమతి,** గుంటూరు

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. ఆకాశంలో ఎంతో ఎత్తున ఎగురుతూ వుండే రాబందులకు నేలమీది ఆహారం ఆచూకీ ఎలా తెలుస్తుంది?**

**జవాబు: వసుమతి!** రాబందులు కంటిచూపుతోనే శవాలను గుర్తిస్తాయని తేలింది. కానీ వాటికి వాసన తెలుసుకునే శక్తి పూర్తిగా లేదనడానికి వీలు లేదు. ఆకుల కింద పూర్తిగా కనబడకుండా మూసివున్న కళేబరాలను అవి గుర్తించి బయటకు లాగినట్టు రుజువైంది. మొత్తం మీద ఆకాశంలో ఎత్తున ఎగురుతూ, బహు శ్రద్ధగా, ఏకాగ్రత తో నేల మీద కళేబరాల కోసం రాబందులు చూస్తూ ఉంటాయి. వాటికి ఎంతో నిశితమైన చూపు వుంది. ఎత్తుగా ఎగరడం వలన విశాలమైన ప్రదేశాన్ని పర్యవేక్షించడానికి అవకాశం ఉంది. చాలాసేపు కదలకుండా పడివున్న జంతువు ఏదైనా కనిపిస్తే కిందికి దిగివస్తాయి. నేల మీదకు దిగిన తర్వాత బాగా కుళ్లిన మాంసపు వాసనను కూడా ఆధారం చేసుకొని అవి ఆహారాన్ని వెతికి పట్టుకుంటాయి.

**- ఎ.భాస్కర్,** వికారాబాద్

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. భూకంపాలను గురించి పరిశోధనలు ఎక్కడ చేస్తారు?**

**జవాబు: భాస్కర్!** శాస్త్రవేత్తలు పసిఫిక్ సముద్రాన్ని ఎంచుకొని పరిశోధనలు ప్రారంభించారు. ఎందుకంటే అక్కడ భూఉపరితలం మిగిలిన అన్ని చోట్ల కన్నా పలచగా ఉంటుంది. భూమి లోపల క్రస్ట్, మాంటెల్, కోర్ అనే భాగాలు ఉంటాయి. క్రస్ట్, మాంటెల్‌కు మధ్యనున్న ప్రాంతంలోనే భూకంపాలు పుడుతుంటాయి. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతంలోని పదార్థాలను విశ్లేషిస్తే భూకంపాల అధ్యయనానికి బాగా తోడ్పడుతుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. దీంతో పాటు భూగర్భంలో వున్న జీవం తాలూకు వివరాలు లభిస్తాయని ఆశిస్తున్నారు.







# స్వేచ్ఛ కోసం రెక్కలు విప్పుతున్న మీడియా

**పత్రికలు భావవ్యక్తీకరణ, రాజ్యాంగపరమైన హక్కును ప్రపంచంలో ప్రథమంగా ఫ్రాన్స్, అమెరికా దేశాలు గుర్తించి ప్రకటించాయి. 1789 ఆగస్టు 24న, ఫ్రెంచ్ నేషనల్ అసెంబ్లీ సమావేశం పత్రికాస్వేచ్ఛను నిర్వచిస్తూ తీర్మానించింది.**

నాడే, స్వేచ్ఛగా ఆలోచనలు, అభిప్రాయాలు అమూల్యమైన హక్కుగా గుర్తింపు పొందింది. స్వేచ్ఛను దుర్వినియోగపరిస్తే బాధ్యత వహించవలసి వుంటుందని కూడా హెచ్చరించింది. అమెరికా దేశం 1791 హక్కుల బిల్లు తొలిసవరణగా, రాజ్యాంగంలో పత్రికాస్వేచ్ఛ డిక్లరేషన్ ఆమోదించిన తొలిదేశం అయింది. ఆ ప్రకారం పత్రికాస్వేచ్ఛ, మతస్వేచ్ఛ, ప్రసంగాలలో, సమావేశాల స్వేచ్ఛను నిరోధించే ఎటువంటి చట్టాలు చేయకూడదు. అదే 1791లో, పేర్కొన్న నిర్వచనాన్ని ఫ్రెంచ్ రాజ్యాంగం ఆర్టికల్ 11గా ఆమోదించింది. అమెరికా, ఫ్రాన్స్‌ల చొరవ కారణంగా, ప్రపంచంలోని పలుదేశాలు ఆధునికతకు చిహ్నంగా పత్రికాస్వేచ్ఛకు చట్టబద్ధత కల్పించాయి. 1830లో విప్లవం విజయం సాధించిన తరువాత, బెల్జియం రాజ్యాంగం అదేపంథా అనుసరించింది.

కాని తర్వాత బౌర్బన్స్ (1814–1830) నెపోలియన్ 111 (1852–1870) రాజకీయ పాలనలో పత్రికాస్వేచ్ఛకు ఫ్రాన్స్‌లో ఒడిదుడుకులు తప్పలేదు. బ్రిటన్‌కు సంబంధించి పత్రికాస్వేచ్ఛ నాటి రోజులలో పౌరులకున్న స్వేచ్ఛకంటే గొప్పదీ కాదు తక్కువదీ కాదు. కాని పత్రికలు, పౌరులు, స్వేచ్ఛను దుర్వినియోగపరిస్తే కఠిన ఆంక్షలు, శిక్షలు అమలులో వుండేవి. కాలక్రమేణా, ప్రథమ ద్వితీయ ప్రపంచయుద్ధాల దశాబ్దాలలో, దేశాలమధ్య 'ప్రెస్–నాన్–ఎటాక్–ప్యాక్ట్' వంటి (పోలండ్–లూథియానా 1938 నవంబర్) ఒప్పందాలు కూడా తల ఎత్తాయి. ఇటలీలో ఫాసిస్ట్, జర్మనీలో నాజీ నిరంకుశ ప్రభుత్వాల పాలనలో, పత్రికాస్వేచ్ఛ ప్రసక్తిలేదు. బ్రిటిష్ సామ్రాజ్యాధికారంలోని దేశాలు, అమెరికా సంయుక్తరాజ్యాలు, లాటిన్ అమెరికా ప్రాంతాలు మెక్సికో, అర్జంటైన్, పరాగ్వే,వెనిజులా తదితర ప్రాంతాలు పత్రికాస్వేచ్ఛ నాడు తీవ్రఅణచివేత, రాజ్యహింసా దౌర్జన్యాలకు గురి అయ్యాయి. సమరయోధులు ఎందరో కరుడుగట్టిన నేరస్థులు అయి ఎటువంటి పత్రికా భావవ్యక్తీకరణ స్వేచ్ఛ లేకుండా కఠిన కారాగారవాస శిక్షలు, ఉరి మరణదండనలు, తుపాకి కాల్పులు ఎదుర్కొన్నారు. కంటి తుడుపుచట్టాలను, బ్రిటిష్ నిరంకుశత్వం తమను వ్యతిరేకించిన విప్లవకారులపై ప్రయోగించి న్యాయం మిషతో అత్యంత క్రూరంగా ప్రవర్తించింది. ప్రపంచంలో 1850 నాటి రోజుల నుంచి ఫ్రాన్స్, నిరంకుశత్వం ప్రెస్‌చట్టాల అణచివేతకు మార్గం చూపించింది. అజ్ఞాతరచయితలపై ఉక్కుపాదం మోపింది. అప్పటి ఫ్రెంచ్ రిపబ్లిక్ అధ్యక్షుడు లూయిస్ నెపోలియన్,

నెపోలియన్ సామ్రాజ్యాధినేతగా కొత్తచట్టాల పేరిట 'బారికేడ్స్'ను అంతం చేసినట్టే జర్నలిజంను తుదముట్టించాలనే' కార్యాచరణ చేపట్టాడు. 1850 నుంచి 1945 శతాబ్దం కాలంలో ప్రపంచంలోని అన్ని దేశాలలో జర్నలిజం, విపరీత పరిణామాలను ఎదుర్కొంది. 18.19,20 శతాబ్దాల ప్రపంచచరిత్ర పరిశీలిస్తే ఫ్రాన్స్, అమెరికా, బ్రిటన్, జర్మనీ వంటి దేశాలలో, సామ్రాజ్యాధికారం కోసం ఉవ్విళ్లూరుతూ ఆయాదేశాల నిరంకుశ ప్రభుత్వాలు, పత్రికాస్వేచ్ఛనే కాకుండా మానవహక్కుల నిర్మూలనకు కంకణం కట్టుకొన్న దృష్టాంతాలు, పాలనావిధానాలు, నిరంకుశ సంస్కరణలు, తీవ్ర అణచివేతలు, శిక్షాస్మృతులు ఎన్నో



ఉన్నాయి.
ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థ యునెస్కో సారథ్యంలో ప్రతీఏటా మేనెల 3వ తేదీ ప్రపంచ పత్రికాస్వేచ్ఛాదినంగా పరిగణించబడుతోంది. ప్రపంచదేశాలలో పెచ్చుపెరుగుతున్న యుద్ధోన్మాదం, చిన్నదేశాలను కబళించాలనే ఆధిపత్య, అధికార వ్యామోహం, అమ్ములపొదిలో చేరిన అణుశక్తి ఆయుధాల సమరోత్సాహం ప్రపంచశాంతికి అవరోధంగా పరిణమిస్తున్నాయి. యిరుగుపొరుగు దేశాలపై చెలరేగుతున్న అమానుష యుద్ధకాండలో, ఎందరో పత్రికా ప్రతినిధులు సంచాలకులుగా పట్టుబడి రహస్యాలను కుతంత్రాలను ప్రపంచానికి చాటిచెప్పే సాహసిక ప్రయత్నాలలో బలి అవుతున్నారు. పట్టుబడిన శత్రుదేశాల సైనికులను అమానుషంగా మట్టుపెట్టడం, మహిళల, పిల్లలు, వృద్ధులపైరాక్షస అమానవీయ ప్రవర్తలను బహిర్గతం చేసే కథనాల ప్రెస్ రిపోర్టరు, మతమౌఢ్యంతో తలలు నరికే ఘోరశిక్షలు అమలు జరుగుతున్నాయి. ఆవిధంగా విధినిర్వహణలో ప్రాణాలు పోగొట్టుకుంటున్న మీడియా వ్యక్తులకు ప్రపంచపత్రికాదినం నాడు ప్రత్యేకంగా స్మరిస్తూ సాహసత్యాగనిరతికి నివాళి ఘటించే, కార్యక్రమాలు నిర్వర్తిస్తున్నారు. ఈ ప్రపంచ పత్రికా స్వేచ్ఛాదినం యునెస్కో, 1993లో ప్రారంభించింది. 'జర్నలిజం లక్ష్యం సేవాధర్మం, శక్తివంతమైన ప్రెస్ తననుతాను నియంత్రించుకోవాలి. అదుపులేని నదీవరద ప్రవాహం ఊళ్లు, పంటలు ముంపుకు గురిచేసి వినాశనం సృష్టించిన విధంగానే, నియంత్రించుకోలేని కులం, నాశనం సృష్టిస్తుంది. అలా అని ప్రెస్‌ను, బయటివారు నియంత్రించడం మరింత విషభరితం కాగలదు. అంతకంటే అసలు నియంత్రణ లేకపోవడమే నయం. ప్రెస్ తనంతట తాను స్వీయనియంత్రణతో తనను అదుపు చేసుకోవడమే ప్రయోజనకరం' అన్నారు. తన జీవితకాలం, భారతజాతి స్వేచ్ఛాస్వాతంత్ర్యసాధన కోసం, సామాజిక సామాన్యజన సంక్షేమకాంక్షతో కలం ఆయుధంగా పోరాడిన జాతిపిత మహాత్ముడు. పత్రికలతోపాటు, ఎలక్ట్రానిక్ డిజిటల్ మాధ్యమప్రసారాలతో, ప్రపంచం అధునాతన సాంకేతిక యుగంలో ప్రస్తుతం ప్రవేశించింది. స్వేచ్ఛకు సంకెళ్ళు వేసే చర్యలు, ధిక్కార, పరువునష్టం నేరాల మిషతో మరింత సంకేళ్లు బిగిస్తున్నాయి. కాలంచెల్లిన రాజద్రోహనేరాల ఆరోపణలు తెరపైకి వస్తున్నాయి. మీడియా స్వేచ్ఛను, వ్యక్తిగత భావప్రకటనా స్వతంత్రతను కబళించే కుయుక్తులు కొనసాగుతున్నాయి. ప్రపంచపత్రికారంగ స్థితిగతుల సాధనాన్ని సూచించే హెచ్చరికలుగా అంతర్జాతీయంగా ప్రతీ ఏటా సూచికలు బహిర్గతం



అవుతున్నాయి. ప్రపంచపత్రికా స్వేచ్ఛా సూచికలో 2012లో, 131వ స్థానంలో వున్న మనదేశం 142వ స్థానానికి మరింతగా దిగజారిపోతోంది. ప్రపంచ జర్నలిస్ట్‌లకు 21వ శతాబ్దంలో విధులు నిర్వర్తించడం కత్తిమీద సాము అవుతోంది. నోబెల్ అవార్డ్ కమిటీ, ప్రజాస్వామ్య పరిరక్షణ, మీడియాస్వేచ్ఛకు ప్రాధాన్యత ఇస్తూ మేరియారెస్సా, (ఫిలిప్పైన్స్ జర్నలిస్ట్) డిమిత్రిఎ. మురటోవ్ (రష్యా జర్నలిస్ట్)లకు 2021లో నోబెల్‌శాంతి అవార్డులు యిచ్చింది. పరిశోధనాత్మక జర్నలిజం ప్రక్రియలో, డిజిటల్ మీడియా కంపెనీ రేప్లర్ స్థాపించిన మేరియారెస్సా, ఫిలిప్పైన్స్ దేశాధ్యక్షుడు రొడ్రిగొడ్యుటిర్టెతో మాదకద్రవ్య సంక్షోభం అంశంలో ప్రభుత్వాలను నిలదీసి ఎదురు ప్రశ్నించారు. అదేవిధంగా డిమిత్రీ మురటోవ్, తనపత్రిక నోవయాగెజిటా'లో రష్యా మిలటరీ ఫోర్స్ పై అవినీతి, హింస, చట్టవ్యతిరేక నిర్బంధాలు, ఎన్నికల కుతంత్రాలు ప్రధానంగా చెచన్యా యుద్ధంపై స్పందించి సాహసంతో కలం ఝళిపించారు. ఆ ప్రచురణల కారణంగా ఆ పత్రికకు సంబంధించిన ఆరుగురు జర్నలిస్ట్‌లు బలి అయ్యారు. 'పొలిట్కోవ్-స్కాజా' అనే మహిళా జర్నలిస్ట్‌ను 2006లో ఆమె ఇంటి బయటే కాంట్రాక్ట్ కిల్లర్‌లు కాల్చి చంపారు. ప్రస్తుతం రష్యా 180 దేశాల 'వరల్డ్ ప్రెస్ ఫ్రీడమ్ ఇండెక్స్'లో 150వ స్థానంలోకి దిగజారింది. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న అగ్రరాజ్యాల ప్రమాదకర వైఖరుల కారణంగా ప్రపంచశాంతికి ముప్పువాటిల్లే యుద్ధోన్మాదం ప్రస్తుతం తల ఎత్తింది. రష్యా అధ్యక్షుడు పుతిన్, ఉక్రెయిన్‌పై యుద్ధం, ఏడాది నుంచి సాగుతోంది. చైనా, రష్యా, పాకిస్థాన్‌ల వైఖరి ఉద్రిక్తతలు సృష్టిస్తోంది. చైనా తైవాన్‌పై దూకుడు పెంచింది. అమెరికా, చైనాలు పరిసర దేశాలలో భౌగోళిక ఉద్రిక్తలకు పాల్పడుతున్నాయి. అధునాతన సాంకేతిక ప్రసార, వార్తాసమాచార వ్యవస్థ ప్రపంచాన్ని నడిపిస్తున్న ప్రస్తుత స్థితిగతులలో మరింత స్వేచ్ఛ కోసం తపిస్తూ, అంతర్జాతీయంగా మీడియా 2023 మే3న కొత్త వార్షిక సంరంభంలోకి అడుగుపెట్టింది.

**- జయసూర్య**



కథ

# అపూర్వ విద్యార్థి

**రమణశాస్త్రి**

అన్నయ్య కూతురు సుమేధ పెళ్లి కోసం అమెరికాలో స్థిరపడిన రమణ భార్య, పిల్లల్తో సొంత ఊరుకొచ్చాడు. నాలుగేళ్ల తర్వాత ఇప్పుడే మళ్లీ ఇండియాకి రావడం. అయినవాళ్లం దరినీ కలవడం కోసం కొంచెం ఎక్కువ రోజులు సెలవు తీసుకొని వచ్చాడు. దానికితోడు పిల్లలకి కూడా సెలవులే. అన్నీ కలిసి వచ్చాయి.

ఆ ఊర్లో రమణవాళ్ల కుటుంబం తెలియని వాళ్లుండరు. రమణవాళ్ల నాన్న సీతాపతిరావు ఊరంతటికీ బంధువు. అందరి కష్టం ఆయన కష్టం. ఆ ఊరి ప్రగతికి ముఖ్య కారకుడు సీతాపతిరావే. మరి... ఆయన మనుమరాలు పెళ్లంటే ఇంక చెప్పాలా!

పెళ్లి ఊరంతా పండగలా జరుపుకున్నారు. రమణభార్య మూణ్ణిద్దర్లకని పెళ్లికూతురుతో పెళ్లికొడుకు వాళ్లింటికి వెళ్లింది. పెళ్లి హడావిడి తగ్గి కొంత తీరిక దొరకడంతో అదే ఊర్లో మెడికల్ షాపు నడుపుతున్న తన చిన్నప్పటి స్నేహితుడు పార్థసారథి దగ్గరకొచ్చాడు రమణ.

“రారా రమణా, వచ్చిన చుట్టాలంతా వెళ్లిపోయినట్టున్నారు. హడావుడి తగ్గినట్టేనా?” పార్థు పరామర్శ.

“ఇవాళేరా కొంచెం తీరిక దొరికింది. ఉద్యోగం చేసే వాళ్లందరూ వెళ్లిపోయారు. పెద్దవాళ్లని పోనివ్వట్లేదు నాన్న. ఆయన సంగతి నీకు తెలుసుగా!” కుర్చీలో కూర్చుంటూ అన్నాడు రమణ.



“నా నలభయ్యేళ్ల జీవితంలో ఇంత సందడిగా జరిగిన పెళ్లి మరోటి చూళ్లేదురా రమణా. జీవితాంతం కళ్లల్లో ఉండిపోతుంది. ఇది నా ఒక్కడి మాట కాదు. ఊర్లో అందరూ ఇదే మాట”.

“ఏమోరా పార్థూ, మీరందరే నాన్న బలం. మీరందరూ కలవకపోతే ఇంత సులువుగా అవుతుందా అయిదు రోజుల పెళ్లి” కృతజ్ఞతగా అన్నాడు రమణ.

“ఇంకా ఏంట్రా అమెరికా సంగతులు?” అడిగాడు పార్థు.

“ఈ పిలుపే కరువైందిరా. ఇలా అరే.. ఒరేయ్ అనే మనిషే ఉండడు. అందరూ మంచివాళ్లే. కానీ మనసును తాకేలా పలకరింపులుండవ్. పార్థూ! నా దృష్టిలో పేదవాడెవడంటే జీవితాంతం చనువుగా అరే, ఒరే అని పిలిచే ఒక్క స్నేహితుడైనా లేనివాడు” చాలా ఉద్వేగపూరితంగా ఉన్నాయి రమణ మాటలు.

వినడం పార్థు వంతు అయింది.

“అక్కడి జాలర్లు వేసిన డాలర్ల వలలో పడి కొట్టుకుపోతున్నామేమో అన్పిస్తుంటుందిరా. చాలా సుఖంగా ఉంటుందిరా అక్కడ, కానీ చాలా ఆనందంగా మాత్రం ఉండదురా”.

“ఏంట్రా అంత ఫీల్ అయిపోతున్నావ్? గ్రీన్‌కార్డువాడివి. పిల్లలిద్దరూ అక్కడే పుట్టారు. ఇంక అదే నీ దేశం చేసుకున్నావ్ అనుకుంటున్నాన్రా నేను” ఆశ్చర్యపడుతూ అన్నాడు పార్థు.

“లేదురా పార్థూ! ఎన్ని సంవత్సరాలు మనం అక్కడ ఉన్నా మనం పరాయి వాళ్లమే అనేది అర్థమైంది. నేను సమూలంగా వెళ్లలేదురా. నా వేళ్లు ఇక్కడే ఉన్నాయిరా, అంటు మాత్రమే అక్కడ పెరుగుతోంది..” ఈ మాటలు అంటున్నప్పుడు రమణ గొంతు గద్గదమైంది.

“అందులో తప్పేముందిరా? అక్కడ మంచి అవకాశాలున్నాయన్పించింది, వెళ్లావు” అనునయంగా మాట్లాడాడు పార్థు.

“వస్తాన్రా! పిల్లలు కొంచెం పెద్దయ్యి వాళ్ల కాళ్ల మీద వాళ్లు నిలవగానే వచ్చేస్తాను. నా నేలకి రుణపడి ఉన్నాను, తీర్చుకోవాలి”. రమణ ఉద్వేగానికి అడ్డు రాకుండా వింటున్నాడు పార్థు.

“చాలినంత సంపాయించానురా. అంతా తెచ్చేస్తానురా. మన ఊరికోసం ఎంత చేసినా తక్కువే. మంచి సంస్కారం, సభ్యతలని నేర్పిన ఈ నేల ఋణం తీర్చుకోలేనిది” చెప్పుకెళ్తున్న రమణ వైపే ఆశ్చర్యంగా చూస్తున్నాడు పార్థు.

రమణ మనసులో తన ఊరి మీద ఇంత ప్రేమాభిమానులు వున్నాయనుకోలేదు అతను. “ట్రంప్ వచ్చినప్పట్నుండి కొంచెంకరంగానే ఉన్నట్లుంది కదా మనవాళ్లకు” వాతావరణంలో గంభీరత తగ్గించేందుకు ప్రయత్నిస్తూ అన్నాడు పార్థు.

“మీడియాలో వస్తున్నంత దారుణంగా లేదు. కానీ ఈర్ష్య, అసూయలు మానవ సహజం కదరా!

ఎవరు ఎప్పుడు ఎలా ప్రవర్తిస్తారో చెప్పలేం కదా! తమ లబ్ధి కోసం అవతల వాళ్లని ఎగేయడం ప్రపంచంలో అన్ని చోట్లా జరుగుతూనే ఉంటుందని చరిత్ర చెబుతూనే ఉందిగా. మన జాగ్రత్తలో మనం ఉంటే మంచిది. ఎందుకంటే వాళ్ల గూట్లో మనం చేరాం కానీ, మన గూడులోకి వాళ్లు రాలేదుగా" వేదాంత ధోరణిలో మాట్లాడాడు రమణ.

ఇంతలో ఎవరిదో ఫోను పార్థుకి.

మాట్లాడ్డం అవగానే అడిగాడు రమణ.. "ఏంరా, ఎక్కడిదాకా వచ్చింది మన ఫ్రెండ్స్ అందరి జాబితా, మళ్లీ వాళ్ల అడ్రస్‌లు సంపాదించడం?"

మళ్లీ తనే అన్నాడు "పెళ్లి పనుల్లో పడి కొంత నెమ్మదించింది మన కార్యక్రమం. ఇంకా పదిహేను రోజులే ఉంది. ఇవాళ రాత్రికి మా ఇంట్లో డాబా గదిలో కూర్చుని ప్రోగ్రాం అంతా పక్కాగా నిర్ణయించేద్దాం. నువ్వు మూర్తిని, భుజంగంగాడ్ని తీసుకొని వచ్చేయ్. నేను ఎదురు చూస్తుంటా" అంటూ లేచాడు రమణ. భుజంగంగాడిని అని పలకడంలో రమణ గొంతులో అహం లేదు, కొండంత చనువే తప్ప.

పదిహేను రోజుల్లో వాళ్లు జరుపుకోవాలనుకుంటున్న పండగ వాళ్ల కళాశాల రజతోత్సవం. అదేరోజు రమణవాళ్ల డిగ్రీ బ్యాచ్ అందరి పునః కలయిక.

ఆ కాలేజీ గురించి చెప్పుకోవాలంటే– రమణవాళ్ల నాన్న సీతాపతిరావు ఆర్మీలో చేసి రిటైర్ అయ్యాడు. ఉన్నత భావాలు కలిగిన వ్యక్తి. మాతృభూమి ఋణం తీర్చుకోవడం ఒక్క సైన్యం చేరడం ద్వారానే వీలవుతుందని నమ్మినవాడు.

పునరావాసం కోసం ఇచ్చిన భూమి పక్కనే రిటైర్మెంట్‌తో వచ్చిన డబ్బుతో ఇంకొంత భూమి కొని వ్యవసాయం మొదలుపెట్టాడు.

ఆ గ్రామంలో పిల్లలు చదువుకోడానికి నాలుగు మైళ్ల దూరంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలకు వెళ్లాల్సి వచ్చేది. పిల్లలకి ఉచిత విద్య ఇవ్వాలని తనే ఒక చిన్న బడి స్థాపించాడు. ఒక పక్క వ్యవసాయం, మరోపక్క విద్యాసాయం.

సీతాపతిరావు ఆదర్శాలకు ప్రభావితులై ఊరిపెద్దలు పాఠశాల కోసం భూదానం చేసి, చందాలు వసూలు చేసి డబ్బు సమకూర్చారు.

ఊరి పెద్దలందర్ని ఒక తాటి మీదకి తెచ్చి కమిటీ స్కూలు ఏర్పరచాడు. సామాన్యంగా గుళ్లకి మాన్యం భూములుంటయ్ కానీ ఈ కళాశాలకి మాన్యం భూములేర్పడినయ్ అంటేనే తెలుస్తుంది... అదంటే ఎంత ఆదరాభిమానాలో ఆ ఊరివాళ్లకి. దాని పేరు నిర్ణయించే బాధ్యత కూడా ఆయనే మీదే పెట్టారు ఊరి పెద్దలు.

సీతాపతిరావు చాలా ఆలోచించి.. ఆలోచించి తనకిష్టమైన కవి శ్రీనాథుడు పేరు పెట్టాడు 'కవిసార్వభౌమ శ్రీనాథ విద్యాలయం".

ఆ విద్యాలయం ఏర్పడిన తర్వాత ఆ ఊర్లో పుట్టిన ఏ బిడ్డా నిరక్షరాస్యుడు కాలేదు. పాత కాలం పిల్లలందరూ శ్రీనాథ విద్యాలయం అని పిలుచుకునేవాళ్లు. ఇప్పటి పిల్లలు దాన్ని శ్రీనాథ్ కాలేజిగా మార్చేసారు పిలుపులో.

మొదట హైస్కూలుగా పుట్టి, కొద్ది కాలానికి జూనియర్ కాలేజిగా పెరిగి, మరో రెండేళ్లకి డిగ్రీ కళాశాల స్థాయి తెచ్చుకుంది శ్రీనాథ విద్యాలయం. రమణవాళ్లు ఆ కళాశాల నుంచి వచ్చిన మొదటి డిగ్రీ బ్యాచ్.

అందుకే కాలేజీ రజతోత్సవం సందర్భంలోనే తమ డిగ్రీ బ్యాచ్ వాళ్లందర్నీ ఒక వేదిక మీద కలపాలనుకున్నాడు రమణ.

"నువ్వుంటే ధైర్యంగా ఉంటుందిరా. నీ వెనక ఎంత పనైనా చేస్తాం" తగ్గిన ఉత్సాహంతో అన్నాడు భుజంగం. "నేను ఆఫీసు పనిలో లేనప్పుడు పూర్తిగా ఇదే పని మీద ఉంటాన్రా. కాకపోతే భౌతికంగా మీ దగ్గర ఉండట్లేదంతే" ముక్తాయించాడు రమణ.

అనుకున్నప్పటి నుండీ ఊళ్లోనే ఉండే పార్థు, మూర్తి, భుజంగం సహాయంతో తమ బ్యాచ్ వాళ్లందరి విషయాలు సేకరించడం, వాళ్లతో మాట్లాడ్డం చేసి "పూర్వ విద్యార్థుల సమావేశం"కు హాజరు అయ్యేలా ఒప్పించడం జరిగిపోతున్నాయి.

రాత్రి ఎనిమిది గంటలకల్లా సీతాపతిరావు ఇంటి డాబా మీద సమావేశమయ్యారు సీతాపతిరావు, కళాశాల కమిటీ సభ్యుల్లో ముఖ్యులు, రమణ అన్నయ్య, రమణ, అతని భార్య, పార్థసారథి, మూర్తి, భుజంగరావు. ఒక గంటసేపు చర్చించుకొని కార్యక్రమం నిర్ణయించారు.

చివర్లో రమణ ఫ్రెండ్స్‌తో అన్నాడు "నాకు అమెరికా ఆఫీసు నుండి ఫోన్ వచ్చిందిరా. మూడు, నాలుగు రోజుల కోసం వెళ్లాలి తప్పనిసరిగా".

"అదేంట్రా?" రమణ మాటలకి అడ్డొచ్చాడు మూర్తి.

"నేను ఒక్కడినే వెళుతున్నా. మన ప్రోగ్రామ్ రోజుకు రెండు రోజుల ముందుకల్లా వచ్చేస్తా. నేనక్కడి నుండి రోజూ మీతో కాంటాక్ట్‌లో ఉంటా. నేను లేకపోయినా పనులు ఆగకూడదురోయ్. మా అన్నయ్య, నాన్నా, నా వైఫ్ అందరూ ఇదే పనిలో ఉంటారు" రమణ చెప్పాడు.

"నువ్వుంటే ధైర్యంగా ఉంటుందిరా. నీ వెనక ఎంత పనైనా చేస్తాం" తగ్గిన ఉత్సాహంతో అన్నాడు భుజంగం.

"నేను ఆఫీసు పనిలో లేనప్పుడు పూర్తిగా ఇదే పని మీద ఉంటాన్రా. కాకపోతే భౌతికంగా మీ దగ్గర ఉండట్లేదంతే" ముక్తాయించాడు రమణ.

## రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం.
రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: **ఎడిటర్, ఆదివారం వార్త,** నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80. sunmagvaartha@gmail.com

**టిక్కెట్ లాగేసుకోబోతుంటే అడ్డుపడిన రమణని కొట్టి, వెళ్తూ వెళ్తూ వాళ్లలో ఒకడు జరిపిన కాల్పుల్లో రమణ అక్కడే కుప్పకూలిపోయాడు. పార్థు కళ్లలో నీళ్ల సుడులు" భౌతికంగా మీ దగ్గర ఉండట్లేదంతే" ఊరెళ్లే ముందు చివరగా రమణ అన్న మాటలు గుర్తుకొచ్చినయ్.**

ఆ మర్నాటి నుండి రమణ పనులన్నీ తనుగా చేస్తూ, కొన్ని పురమాయిస్తూ, ఎవరెవరు ఏది పర్యవేక్షణ చేయాలో అన్నీ రాసి, ఒక ఫైల్ వెళ్లేముందు వాళ్ల నాన్నకి, అన్నయ్యకి, పార్థుకి అప్పచెప్పాడు. వేడుకలు ఇంకో వారం రోజుల్లో వున్నాయనగా రమణ అమెరికా వెళ్లాడు ఆఫీసుపని పూర్తి చేయడానికి.

....................

నాలుగు రోజులు ఇట్టే గడిచిపోయినయ్. అయిదో రోజు రమణ ఫోన్ చేసి "నేను ఇంకో గంటలో బయల్దేరుతున్నార్రా ఇండియాకి. ఫ్లైట్ ఆలస్యం లేకపోతే రేపు సాయంత్రానికల్లా అక్కడుంటా. ఫ్లైట్‌లో మొబైల్ పనిచేయదు కాబట్టి మాట్లాడ్డం కుదరదు" అన్నాడు పార్థుతో.

"రా..రా.. నీ కోసమే చూస్తున్నాం" పార్థు చెప్పాడు ఉత్సాహంగా.

ఇంకో రోజు కూడా గడిచిపోయింది.

రమణవాళ్ల ఊరు పండగ వాతావరణం నింపుకుంది. వచ్చిన వాళ్లకి అందరికీ కళాశాలలోనే అన్ని ఏర్పాట్లూ, ఆడిటోరియంలో సభలు, సమావేశాలు.

పాత విద్యార్థులు, పాత ఉపాధ్యాయుల కలయిక, పలకరింపులతో ఆ స్థలమంతా సందడిగా ఉంది.

మూర్తి పార్థుని కల్సినప్పుడల్లా అంటున్నాడు "రమణ ఏంట్రా ఇంకా రాలేదు" అని.

"అదేరా చూస్తున్నా! కలిసిన వాళ్లందరూ అడుగుతున్నారు. మధ్యాహ్నం నుండి రమణవాళ్ళ అన్నయ్య కూడా లేడు. హైదరాబాదు వెళ్లాడట ఇప్పుడు చాలా అవసరంగా" చెప్పాడు పార్థు.

మర్నాడు కళాశాల రజతోత్సవం మొదలైంది ఉదయం పది గంటలకల్లా. వక్తల ప్రసంగాలు, విద్యాలయం మొదటి ప్రధానోపాధ్యాయుడు పరంధామయ్యగారికి సత్కారం, గండపెండేరం బహూకరణ.

మొదటి మహిళా ఉపాధ్యాయురాలికి సత్కారం; కళాశాలలో పనిచేసిన అధ్యాపకులకు, ఉద్యోగులకు బంగారు పతక జ్ఞాపికలు;

ప్రతి సంవత్సరం అత్యధిక మార్కులు వచ్చిన విద్యార్థులకు బహుమతులు, రాష్ట్ర స్థాయి క్రీడాకారులుగా ఎదిగిన ప్రస్తుత, పూర్వ విద్యార్థులకు బహుమతులు; ప్రస్తుత విద్యార్థినీ, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు.. ఒకదాని తర్వాత ఒకటి సజావుగా జరిగిపోతున్నాయి.

ఇవన్నీ రమణ, వాళ్ళ నాన్న ప్లాన్ చేసినవే. రమణ మాత్రం ఇంకా రాలేదు. సీతాపతిరావు గారు అన్ని కార్యక్రమాలు పద్ధతిగా జరిగేలా చూసుకుంటున్నాడు. ఆయనకి చేయబోయిన సన్మానాన్ని సున్నితంగా తిరస్కరించాడు.

తర్వాత మధ్యాహ్నం విందు, కొద్దిసేపు విరామం తర్వాత రమణ వాళ్ల డిగ్రీ మొదటి బ్యాచ్ పూర్వ విద్యార్థుల కలయిక సంబరం..

అందరూ రమణ గురించే అడుగుతున్నారు.. "రమణ ఏడీ? ఎక్కడని?"

"వస్తున్నాట్ట.. మధ్యలో ఉన్నాడు. మనల్ని సమావేశం మొదలు పెట్టమంటున్నారు వాళ్ల నాన్న" అన్నాడు పార్థు.

అయిష్టంగానే మొదలుపెట్టారు రమణ స్నేహితులు.

చివరి వక్తగా రమణ పేరు రాసారు.

మిత్రులందరూ శ్రీనాథ కళాశాలతో వాళ్ల అనుబంధం తీపి-చేదు అనుభవాలు, చిలిపి చేష్టలు, వేరేవాళ్లకు పెట్టిన వికృత, వేళాకోళ మారు పేర్లు అన్నీ గుర్తు చేసుకుంటున్నారు.

ఇంతలో అంబులెన్సు బండి వచ్చి ఆగింది.

సమావేశంలో నిశ్శబ్దం ఆవరించింది.

అందులోంచి రమణ అన్నయ్య, భార్య దిగారు.

వెనకనే స్ట్రెచర్ దింపారు.

దాని మీద అచేతనంగా రమణ.

"రమణ.. రమణ.." ఎవరో అరుస్తున్నారు.

అందరూ అటువైపు పరిగెత్తారు.

"ఏమైంది...ఏమైంది.. రమణకి?" అడుగుతున్నారు కొందరు.

వాళ్ల అన్నయ్య ద్వారా తెలిసింది...

ఇండియా రావడానికి ఎయిర్‌పోర్ట్‌కి బయల్దేరిన రమణ మధ్యలో కారు పెట్రోల్ స్టేషన్ దగ్గర ఆపాడు.

వెనకనే మరో కారులో వచ్చిన ముగ్గురు అమెరికన్లు రమణ కారును గుద్ది ఇండియన్స్‌ని తిడుతూ రమణ దగ్గర ఉన్న డబ్బు, కార్డ్స్ లాగేసుకున్నారు.

టిక్కెట్ లాగేసుకోబోతుంటే అడ్డుపడిన రమణని కొట్టి వెళ్తూ వెళ్తూ వాళ్లలో ఒకడు జరిపిన కాల్పుల్లో రమణ అక్కడే కుప్పకూలిపోయాడు.

పార్థు కళ్లలో నీళ్ల సుడులు "భౌతికంగా మీ దగ్గర ఉండట్లేదంతే.." ఊరెళ్లే ముందు చివరగా రమణ అన్న మాటలు గుర్తుకొచ్చినయ్.

"మాట తప్పావురా రమణా! ఇప్పుడు భౌతికంగా మాత్రమే ఉన్నావురా మా మధ్య" పార్థు మౌన రోదనలో కొట్టుకొచ్చిన మాటలు.

రమణ దేహాన్ని పూర్వ విద్యార్థుల వేదిక మీద అందరి మధ్యలో ఉంచారు.

అదొక అసాధారణ పూర్వ విద్యార్థుల కలయిక. ●

## కార్టూన్లకు ఆహ్వానం

కార్టూనిస్టుల నుండి ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని కార్టూన్ల తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి.

కార్టూన్లు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-500 080



# కోపంతో తంటాలు

ఓ మనిషి కోపంగా ఉన్నప్పుడు అతనిని నిశితంగా గమనించండి.
అతని ముఖాన ఓ మృగంఛాయలు కనిపిస్తాయి.
ఇంతకూ ముఖం అందంగా ఉండేదెప్పుడు..
అతను నవ్వుతూ ఉన్నప్పుడే. కోపంగా ఉన్నప్పుడు ముఖం అందంగా ఉండదు. అసలు చూడలేం ఆ ముఖాన్ని అసహ్యం వేస్తుంది.
సారు కోపంగా ఉన్నారు. ఈ కోపం తగ్గేలోపు ఓ ఫొటో తీసేసి అందంగా ఉంటుందని ఎవరూ చెప్పరుగా.
ఫొటో తీసేవారు కూడా ఫొటో తీసే ముందు ముఖాన్ని కాస్తంత నవ్వుతున్నట్టు పెట్టండి సార్ అంటారు. అంతేతప్ప ముఖాన్ని చురచురా పెట్టండి సార్.. అప్పుడే బాగుంటుందని ఎవరూ చెప్పరుగా.
ఓ నిజమేమిటో తెలుసా..
కోపం మనసునూ పాడు చేస్తుంది. దేహాన్ని పాడు చేస్తుంది.
కోప్పడేవారి ఆయుష్షు తగ్గుతూ వస్తుందనేది నిజం.
అలాగే నవ్వేవారి ఆయుష్షు పెరుగుతుందన్న మాటా నిజమే.
కోప్పడేవారిని ఎవరూ ఇష్టపడరు. వారితో మాట్లాడ్డానికి కూడా ఇష్టపడరు. ఎప్పుడూ రుసరుసలాడే తల్లిదండ్రుల దగ్గరకు పిల్లలు చనువుగా వెళ్లరు.
కోప్పడే అధికారుల వద్దకు కింది స్థాయి ఉద్యోగులు వెళ్లడానికి అంతగా ఇష్టపడరు.
అతను ఎప్పుడు చూసినా అరుస్తాడు. కుక్కలా మొరుగుతాడు.
అతని పక్కనే కూర్చోవాలని ఎవరైనా అంటున్నారంటే అది వెటకారంతో చెప్తున్నాడని అర్థం చేసుకోవాలి.
సరేగానీ.. కోపం ఎందుకు వస్తుంది.. అసహనంవల్లో, అశక్తత వల్లో చేతకాకపోవడంవల్లో వస్తుంది కోపం. ఏదన్నా ఒకటి చెయ్యాలనుకుని చెయ్యలేకపోయినప్పుడు ఎంత వద్దనుకున్నా కోపం వస్తుంది.
సమర్థత వున్నవారు కోప్పడవలసిన అవసరమే లేదు.
ఓ నిజమైన కవి వద్దకో, రచయితక వద్దకో వెళ్లి ఏదన్నా రాయమన్నప్పుడు అతను వెంటనే మండిపడకూడదు.
ఒకవేళ అతను మండిపడుతున్నాడంటే అది అతని అసమర్థతను బయట పడుతోందని గ్రహించాలి.
శిల్పి శిల్పం చేయడానికి కోప్పడకూడదు.
ఓ అధికారి చెప్పారు "మీరు చెప్పేదంతా బాగానే ఉంది వినడానికి. అయినా కోపమే రాలేదంటే పనులవవు సార్. అందుకే రోజూ ఆఫీసులో అరుస్తుంటాను" అని.
కానీ నిజమేమిటంటే–
అరవడం వల్ల అరుపులే నలుగురికీ వినిపిస్తాయి. కానీ పనులేవీ జరగవు. పని జరుగుతున్నట్టు అన్పిస్తుంది. కానీ పనవదు.
తిట్లు తినేవారెవరూ తాను చేసింది తప్పని ఒప్పుకోవడమంటూ జరగదు. అది తప్పని వారు తెలుసుకోరు కూడా.
తిట్టడం వల్ల ఏం ప్రయోజనం.. అసలు తిట్టే ఉద్దేశం ఏమిటి? తిట్లు తినే వ్యక్తి తన వైఖరిని సరిదిద్దుకుంటాడనేగా.



తన ఉద్దేశం నెరవేరుతుంది అని అనుకున్నప్పుడు పది మందికి తెలిసేటట్లు అరవడం ఎందుకు?
తిట్టడం వల్ల ఒకరిలో మార్పు తీసుకురాగలమనుకుంటే దొంగతనం చేసే వారందరినీ పిలిచి కాస్సేపు అదేపనిగా తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టి ఇక వెళ్లిరా అని చెప్పవచ్చుగా.
కనుక మనం ముఖ్యంగా తెలుసుకోవలసింది ఏమిటంటే కోపం అనేది ఇతరులకు మనమిచ్చే శిక్ష కాదు.
అది మనకు మనం వేసుకునే శిక్ష. ఇతరులను సరిదిద్దడం కోసం అని అనుకుంటూ మనల్ని మనమే తగ్గించుకోవడానికి చేసుకునే ప్రయత్నమవుతుంది.
మన మనసు చెడిపోతుంది. మన ఆరోగ్యమూ దెబ్బ తింటుంది. కోపం వల్ల జరిగే నష్టాలివి.
నాకు తెలిసిన వాడొకడున్నాడు.
"నాకు కోపం వస్తే నేను ఆ కోపాన్ని మనుషుల మీద చూపను సార్. వారిని కోపగించుకోవడం వల్ల వారిలో మార్పు తీసుకురాలేనని తెలుసు" అన్నాడు.
"మరైతే ఏం చేస్తావ్?" అని అడిగాను.
"అందుకే ఆ కోపాన్నంతా వస్తువుల పైన చూపిస్తాను. ఇంట్లో ఉన్న పాత్రలను విసిరేస్తాను" అన్నాడు.
"దాని వల్ల కోపం తగ్గిందా?" అని అడిగాను.
"నాకు తగ్గింది. కానీ ఎదురింటి వాడికి కోపం ఎక్కువైపోయింది" అన్నాడు.
"అదెలా?" అని అడిగాను.
"ఏముందీ.. నాకు కోపం వచ్చినప్పుడు తిన్నగా ఎదురింటికి వెళ్లి అక్కడి నుంచే కదా వస్తువులను విసురుతాను" అన్నాడు.

**- యామిజాల జగదీశ్**



# మహిళలకు ప్రత్యేకం ఆటుకల్ పొంగలి

కొన్ని లక్షల మంది స్త్రీలు ఒకచోట చేరి వంట చేయడం.. ఆ సంరంభం ప్రపంచంలోనే పేరు పొంది గిన్నిస్‌బుక్ రికార్డ్స్‌లో నమోదు అవడం విశేషం. ఒక రాష్ట్ర రాజధాని మొత్తం కుల, మత భేదం చూడకుండా సహకరించడం మత సామరస్యానికి చక్కటి ఉదాహరణ. అలాగే ఈ విశేషంలో పాల్గొనే స్త్రీలకి ఎంతటి గౌరవం ఇస్తారో మాటల్లో చెప్పలేం. కేరళ రాష్ట్ర రాజధాని తిరువనంతపురంలో అమ్మవారికి సమర్పించే పొంగలి సంరంభం ఇది. ప్రతి ఏటా ఫిబ్రవరి-మార్చి నెలలో అమ్మవారికి ఈ పొంగలి మహోత్సవం ఘనంగా జరుపుతారు. తిరువనంతపురంలో ఆటుకల్ అనే ప్రదేశం నగరానికి దగ్గరలో ఉంది. అక్కడ అమ్మవారి ఆలయం ఉంది. మలయాళంలో ఆటుకాల్ భగవతి క్షేత్రం అని పిలుస్తారు. కేరళ రాజధాని తిరువనంతపురంలో కిల్లియారు అనే నది ఒడ్డున ఆటుకాల్ భగవతి క్షేత్రం ఉంది. ముల్లవీటిల్ అనే వారి ఇంటి పెద్దకి కలలో ఒక బాలిక "నది ఆవలి ఒడ్డున ఉంది, తనని ఇవతల ఒడ్డుకి చేర్చమని" అడుగుతుంది. ఆ పెద్దాయన ఈదుకుంటూ వెళ్లి బాలికను ఇవతలి ఒడ్డుకి తీసుకొచ్చి తన ఇంటికి తీసుకువెళ్లేలోపు ఆ బాలిక అదృశ్యమైంది. అది గమనించి ఆ పెద్దాయన బాధపడ్డాడు. అప్పుడు ఆ బాలిక "తనని నది ఒడ్డున ప్రతిష్ఠించి పూజలు చెయ్యమని" కోరింది. మరో కథనం ప్రకారం.. తమిళనాడులోని మధురై పట్టణాన్ని కోపంతో దహించివేసిన కణ్ణగి కన్యాకుమారి నుండి కేరళలో గల కొడుంగల్లూరు భగవతి క్షేత్రంలో ఉండడానికి వస్తూ ఇక్కడ ఆటుకాల్‌లో దేవీ రూపంగా ఉండిపోయిందని అంటారు. ఆటుకాల్ భగవతి క్షేత్రంలో ఏడాదంతా పూజాదికాలు జరపడం ఒక ఎత్తు. పొంగల్ మహోత్సవ సమయంలో పది రోజుల పూజల విశేషం మరో ఎత్తు అని చెప్పవచ్చు. ఇక్కడ సాధారణంగా అమ్మవారు శాంత స్వరూపిణిగా ఉండి అందరినీ కటాక్షిస్తుంది. కానీ పొంగల్ సమయంలో మాత్రం ఉగ్ర రూపిణిగా ఉంటుంది. పొంగల్‌రోజు లక్షలాది మంది స్త్రీలు, పిల్లలు భక్తితో పొంగలి సమర్పించడం చూసి దేవి శాంతించి, కరుణవర్షాన్ని కురిపించి కోరిన కోరికలు నెరవేరుస్తుందని నమ్మకం. దేవికి పొంగలి సమర్పించడం గొప్ప విశేషమని చెప్పవచ్చు. ఆటుకాల్ భగవతికి పొంగల్ ఉత్సవంలో స్త్రీలు మాత్రమే పాల్గొనాలి. ఇరవై ఐదు లక్షలమంది స్త్రీలు పొంగలి సమర్పించినట్టుగా గిన్నిస్‌రికార్డ్ నమోదు కాబడి ప్రపంచ దృష్టికి వెళ్లింది. కొన్ని లక్షల మంది స్త్రీలు ఒకేరోజు పొంగలి వండి దేవికి సమర్పించడం గొప్ప విశేషం. ఒక విధంగా చూస్తే ఆటుకాల్ భగవతి క్షేత్రం స్త్రీ శబరి క్షేత్రంగా పిలవడం అతిశయోక్తి కాదు. ఆటుకల్ పొంగల్ ఉత్సవంలో తొమ్మిదో రోజు కేరళ రాష్ట్రం నాలుగు మూలల నుండే కాక, విదేశాల నుండి సైతం స్త్రీలు ముందురోజు తిరువనంతపురంలోని ఆటుకాల్ క్షేత్రానికి చేరుకుంటారు. భక్తులకు కావలసిన అన్ని సౌకర్యాలు, భద్రతా, రవాణా వంటి సదుపాయాలను కేరళ ప్రభుత్వం కల్పిస్తుంది. మూడు ఇటుకలు, కర్రలు, కొత్త కుండ, బియ్యం, బెల్లం, పాలు మొదలైనవి తమతో తెచ్చుకుని గుడిచుట్టూ ముందురాత్రి స్థలం చూసుకుని అక్కడే ఉంటారు. పొంగలి వండడానికి వీధులన్నీ శుభ్రం చేసి ఉంచుతారు. ఆ రాత్రి స్త్రీలు, వారితో పాటు వచ్చిన పురుషులు ఇళ్ల అరుగుల మీద, దుకాణాల మెట్ల మీద పడుకుంటారు. స్త్రీలకు కుల-మత భేదం లేకుండా స్థానికులు వారికి తగిన సౌకర్యాలు కల్పిస్తారు. మరుసటి రోజు ఉదయం స్త్రీలు స్నానం చేసి, కొత్త వస్త్రాలు ధరించి దేవికి పొంగలి సమర్పించడానికి సిద్ధంగా ఉంటారు. ఆటుకల్ దేవి చైతన్యానికి ఒక గొప్ప నిదర్శనం. ముహూర్తానికి ముందు చిన్నగా వర్షం కురిసి దారి అంతా శుద్ధి పర్చడం, అమ్మవారి ముందు పొంగల్‌కి అగ్ని వెలిగించడం అందులో నుంచి పూజారి అగ్ని తీసుకుని భక్తుల పొయ్యిలు వెలిగిస్తాడు. ఆ విధంగా పూజారులు లక్షలలో భక్తులు పొయ్యిలు వెలిగించి అమ్మవారికి పొంగలి సమర్పిస్తారు. అలాగే కేరళలో మిగతా అమ్మవారి దేవాలయాలలో పొంగలి సమర్పణ గావిస్తారు. దేవి శక్తికి స్త్రీల నమ్మకానికి ఇంతకంటే వేరే ఏమి చెప్పగలం! పదమూడు సంవత్సరాలలోపు మగపిల్లలకి కుత్తిఒట్టం అనే వ్రతం ఉంది. పొంగలి ఉత్సవంలో మూడోరోజు జరుపుతారు. ఈ వ్రతం తీసుకున్న పిల్లలు ఏడు రోజులు దేవాలయంలో ఉండాలి. వారికి అన్ని సౌకర్యాలు కల్పిస్తారు. ఏడు రోజులలో వేయి ఎనిమిది సాష్టాంగ నమస్కారాలు సమర్పించాలి. కొంతమంది పిల్లలు పొర్లు దండాలు చేస్తారు.

దేవి సాధారణ పూజలలో ప్రతినెల పౌర్ణమి రోజు జరిపే ఐశ్వర్యపూజ స్త్రీలు స్వయంగా జరుపుకోవచ్చు. పూజారి దేవి ముందు నుండి వెలిగించి తెచ్చిన దీపం నుండి స్త్రీలు తమ తమ దీపాలను వెలిగించి వయసులో పెద్ద ముత్తైదువ చెప్పే మంత్రాలను, శ్లోకాలను వల్లె వేయాలి. అలాగే అన్ని నెలల్లో ఆదివారం అఖండ నామజపం జరుపుతారు. ఆటుకాల్ భగవతి దేవికి పూజలు చేస్తే సౌభాగ్యం, సంతానం కలుగుతుందని స్త్రీల నమ్మకం. అమ్మవారికి జరిపే పంచామృతాభిషేకం, స్వర్ణ కలశంలో కలశాభిషేకం, అష్ట ద్రవ్యాభిషేకం, పుష్పాభిషేకం జరుపుతారు. ఉదయం ఏడు నుండి జరిపే అమ్మవారి కలశాభిషేకం దర్శించడం శుభప్రదం. కొన్ని అభిషేకాలు సంవత్సరాల ముందే బుక్ అయి ఉంటాయంటే అమ్మ మీద ఎంత నమ్మకమో తెలుస్తుంది.

**- ఈ.ఎస్.మాధవన్**



# ఆకట్టుకునే ఆస్ట్రేలియా అందాలు

**షేక్ అబ్దుల్ హాకీం జాని**

**ఆస్ట్రేలియా** ఒక ద్వీప దేశం. పర్యాటకుల కలల భూమి. ఆదిమవాసుల స్వర్ణ కాలంనాటి పవిత్ర కథల నుండి పగడపు దిబ్బలు, కాలిపోయిన ఎర్రటి ఎడారులు, వర్షారణ్యాలు, సుందర నగరాలు ఇత్యాదివి తిలకించాలనుకునే పర్యాటకులు ఆస్ట్రేలియాను పర్యాటకులు కలల భూమిగా భావిస్తారు. ఇది ప్రపంచంలోని అతి పెద్ద ద్వీపం. అయితే అతి చిన్న దేశం కూడా. ఆస్ట్రేలియా యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాతో సమానంగా ఉంటుంది. ప్రపంచంలోని అత్యంత చమత్కారమైన కంగారు వంటి జంతువులు ఇక్కడ కనిపిస్తాయి. ఇది అద్భుతమైన అందం, వైరుధ్యాలకు ప్రసిద్ధి చెందిన భూమి. తీరం వెంబడి పురాతన వర్షారణ్యాలు, శక్తివంతమైన మెట్రోపాలిటన్ నగరాలు, విస్తారమైన ఇసుకద్వీపాలు, ప్రపంచంలోనే అత్యంత విస్మయం కలిగించే అద్భుతాలలో ఒకటైన గ్రేట్ బారియర్ రీఫ్‌ను ఇక్కడ అన్వేషించవచ్చు. పర్యాటక అందాలతో నిండిన సుందర కాన్‌బెర్రా నగరం ఆస్ట్రేలియా జాతీయ రాజధానిగా విరాజిల్లుతుంది. భౌగోళికంగా ఆస్ట్రేలియా రాజధాని భూభాగం న్యూ సౌత్ వేల్స్ రాష్ట్రంలో భాగంగా ఉంది. జాతీయ ప్రభుత్వ స్థానంగా ఆస్ట్రేలియన్ పార్లమెంట్, సెంట్రల్ ఫెడరల్ కార్యాలయాలు కాన్‌బెర్రాలో ఉన్నాయి. జాతీయ గ్యాలరీలు, మ్యూజియంలు, గ్రంథాలయాలు, జాతీయ స్మారక చిహ్నాలు, విదేశీ రాయబారుల కార్యాలయాలు ఇక్కడ ఉన్నాయి. ఆస్ట్రేలియాలో యునెస్కోవారు ప్రపంచ వారసత్వ ప్రదేశాలుగా గుర్తించిన పర్యాటక ప్రదేశాలు అనేకం ఉన్నాయి. వాటిలో కొన్ని ప్రదేశాల వివరాలు.

**సిడ్నీ:** ఆస్ట్రేలియాలోని మహా నగరాలలో సిడ్నీ ఒకటి. ఇది సౌత్‌వేల్ రాష్ట్రానికి రాజధాని. సిడ్నీ భౌగోళిక విస్తీర్ణం 12144.6 చదరపు కిలోమీటర్లు. జనాభా దాదాపు 54 లక్షల మంది ఉంటారు. జనాభా పరంగా ఆస్ట్రేలియాలో ఇది పెద్ద నగరం. ఇక్కడ ప్రపంచం నలుమూలల నుండి వచ్చిన విభిన్న సంస్కృతుల జనసమూహం ఉంది. 1788లో ఆర్థర్ ఫిలిప్ మొదటి బ్రిటిష్ స్థావరాన్ని సిడ్నీలో స్థాపించారు.

పట్టణ ప్రాంతంలో అనేక నౌకాశ్రయాలు, సముద్ర తీరాలు, వారసత్వ జాబితాలో నమోదైన అనేక భవంతులు ఉన్నాయి. ఆస్ట్రేలియాలో సందర్శించదగిన ప్రదేశాలలో సిడ్నీ అత్యంత ప్రధానమైన నగరమే కాక ప్రసిద్ధ పర్యాటక కేంద్రం కూడా. డైనమిక్ కల్చరల్ హబ్ సిడ్నీ భారీ సహజ నౌకాశ్రయం ప్రపంచంలోనే అత్యుత్తమమైనదిగా పరిగణిస్తారు. విశాలమైన నౌకాశ్రయం సహజ సౌందర్యంతో ఆకట్టుకుంటుంది.

ఇక్కడ సిడ్నీ ఒపేరా హౌస్, హార్బర్ బ్రిడ్జి ప్రసిద్ధి చెందాయి. ఒపేరా హౌస్ పెద్ద షెల్ ఆకారపు తెరచాపలు ప్రపంచ వారసత్వ ప్రదేశం మాత్రమే కాక ప్రపంచంలోని గొప్ప నిర్మాణ చిహ్నాలలో ఒకటి. సిడ్నీ ఒపేరా హౌస్ 600 అడుగుల పొడవు, 400 అడుగుల వెడల్పుతో ఉంటుంది. ఇది అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ఆస్ట్రేలియన్ చిహ్నం. సిడ్నీలోని అత్యంత ప్రసిద్ధ ఆకర్షణలలో ఒకటి. సిడ్నీ ఒపేరా హౌస్‌ని నిర్మించడానికి 14 సంవత్సరాలు పట్టింది. ఇందులో థియేటర్, స్టూడియోలు, కచేరీ హాలు, ఎగ్జిబిషన్ గదులు ఉన్నాయి. ఫెర్రీలో సముద్ర జలాలపై విహరిస్తూ సిడ్నీ హార్బర్ సౌందర్యాన్ని వీక్షించవచ్చు. దీన్ని 1932లో ప్రజల కోసం ప్రారంభించారు.

సిడ్నీ హార్బర్ వంతెన ఉక్కుతో నిర్మించిన విల్లువంటి వంతెన. సిడ్నీ వాణిజ్య కేంద్రాలు, ఉత్తర తీరాల మధ్య వాహనాలు, పాదచారుల రాకపోకలకై దీనిని నిర్మించారు. 1149 మీటర్ల పొడవుతో ప్రపంచంలోని ఐదవ అతి పెద్ద పరిధి గల వంపు వంతెనగా పేరుగాంచింది. ఈ వంతెన శిఖరాగ్రం సముద్ర మట్టానికి 440 అడుగుల ఎత్తులో ఉంటుంది. దీని నిర్మాణ శైలి అద్భుతం. వంతెన మొత్తం ఉక్కుబరువు 52,800

టన్నులుంటుందని అంచనా. వంతెనపై ద్వారాలను గ్రానైట్‌తో చెక్కారు. ఈ వంతెన మొత్తం 8 మార్గాలను కలిగి ఉంటుంది. దీని ప్రధాన రోడ్డు మార్గాన్ని బ్రాడ్ఫీల్డ్ హైవే అని పిలుస్తారు. సిడ్నీ నూతన సంవత్సర వేడుకల్లో ఈ వంతెనకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. ఆ సమయంలో ఇక్కడ బాణాసంచా ప్రదర్శనలతో సందడి చేస్తారు. ఏటా ఒక్కొక్క నమూనాతో బాణాసంచా కాంతిలో వంతెన కనిపించే విధంగా రూపకల్పన చేయడం ఓ విశేషం. ఫెర్రీలో కూడా పయనిస్తూ ఒపేరా హౌస్, హార్బర్ వంతెనల అందాలను మరింత దగ్గరగా ఆస్వాదిస్తూ విహరించడం పర్యాటకుల్లో నూతన ఉత్తేజాన్ని నింపుతుంది. 820 అడుగుల ఎత్తులో నెలకొనివున్న అబ్జర్వేషన్ డెక్‌తో కూడిన సిడ్నీ టవర్ ప్రత్యేక ఆకర్షణ. తప్పక సందర్శించదగిన వాటిలో బోండి బీచ్ ఒకటి. ఇది సర్ఫర్‌లకు స్వర్గ ధామంగా ఉన్న బంగారు తీరం ఉన్న ఆస్ట్రేలియాలోని అత్యంత ప్రసిద్ధ బీచ్. డార్లింగ్ హార్బర్‌లో వాటర్ ఫ్రంట్ డైనింగ్, సిడ్నీ అక్వేరియం, ఆస్ట్రేలియన్ నేషనల్ మారిటైమ్ మ్యూజియం, మేడమ్ టుస్సాడ్స్, వైల్డ్ లైఫ్ జూ, చైనీస్ గార్డెన్ వంటి అనేక ఆకర్షణలు ఉన్నాయి.



## అక్వేరియం

ఆస్ట్రేలియాలో చూడదగిన వాటిలో సముద్ర జీవులుండే సిడ్నీ అక్వేరియం ప్రధానమైనది. సముద్ర జీవుల్ని చూడ్డానికి సిడ్నీ అక్వేరియం చాలా మంచి వేదిక. ఇందులోని రకరకాల చేపల అందాలను వీక్షించేందుకు పర్యాటకులు ఏటా వేల సంఖ్యలో వస్తుంటారు. దాదాపు 650 ఆస్ట్రేలియా జాతులకు చెందిన 12 వేలకు పైగా సముద్రజీవులు ఇక్కడ ఉన్నాయని అంచనా. ఇవన్నీ సందర్శకులకు కనువిందు చేస్తుంటాయి. చిన్న చిన్న చేపలతో పాటు పెద్ద పెద్ద డగాంగ్స్, షార్క్‌లు, ఉష్ణమండల చేపలు, తాబేళ్లు, పెంగ్విన్లను సైతం ఇక్కడ దర్శించవచ్చు. అక్వేరియంను చూస్తుంటే అద్భుతంగా తోస్తుంది. ఇందులోనే ఆక్రిలిక్‌తో నిర్మించిన సొరంగ మార్గాల ద్వారా నడుస్తూ చుట్టూ రంగు రంగుల చేపలు, రకరకాల ఆక్టోఫస్‌లు, త్రిభుజాకారంలో ఉన్న తోకచేపలు, సొరచేపలు, సముద్రపు గుర్రాలు, తిమింగలాలను దగ్గరగా చూస్తుంటే ఓ వింత అనుభూతి కలుగుతుంది. ఇక్కడ మంచుగడ్డల్లో ఏర్పాటు చేసిన హిమ వాతావరణంలో వున్న పెంగ్విన్లను బోట్లో వెళ్లి దగ్గరగా చూడవచ్చు. ఈ అక్వేరియం యూనివర్సిటీలు, ఇతర సంస్థలకు సముద్ర జీవులపై పరిశోధనలకుగాను అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తుంది.

## మెల్‌బోర్న్

ఆస్ట్రేలియాలో సందర్శించదగిన ప్రదేశాలలో మెల్‌బోర్న్ ఒకటి. ఆస్ట్రేలియాలో ప్రసిద్ధ ప్రదేశం. నగరంలో ఉద్యానవనాలు, థియేటర్లు, ప్రత్యక్ష సంగీత వేదికలు, స్ట్రీట్ ఆర్ట్ కుడ్య చిత్రాలు మొదలైనవెన్నో ఇక్కడ కనిపిస్తాయి. మెల్‌బోర్న్ ఆస్ట్రేలియా సాంస్కృతిక రాజధాని. ప్రపంచం నలుమూలల నుండి ఇక్కడకు పర్యాటకులు వస్తారు. నగరంలో స్టేడియంలు, కొలనులు ఉన్నాయి. ఇది ప్రపంచంలోనే అత్యుత్తమ నివాసయోగ్యమైన నగరంగా గుర్తింపు పొందింది. మెల్‌బోర్న్ మ్యూజియం ఆస్ట్రేలియా సహజ, సాంస్కృతిక చరిత్ర మ్యూజియం. ఇది ఆస్ట్రేలియన్ సామాజిక చరిత్ర, ఆదిమ సంస్కృతులు, సైన్స్, పర్యావరణం మొదలైన వాటికి చెందిన అంశాలు ఇక్కడ తిలకించవచ్చు. ఇక్కడి జంతు ప్రదర్శనశాల చాలా పురాతనమైనది. ఇందులో దాదాపు 320 జాతుల ప్రాణులు ఉన్నాయి. వీటిలో ఓపెన్ ఎయిర్ ఎన్‌క్లోజర్‌లలో జిరాఫీలు, జీబ్రాలు ఉన్నాయి. పెంగ్విన్‌లు, సీల్, సొరచేపలు, సముద్ర గుర్రాలు ఉన్న వైల్డ్ సీ ఎగ్జిబిట్‌లో విక్టోరియా సముద్ర జీవాన్ని చూడండి. మెల్‌బోర్న్ రాయల్ బొటానిక్ గార్డెన్స్ 36 హెక్టార్ల విస్తీర్ణంలో 50,000 కంటే ఎక్కువ మొక్కలు ఉన్నాయి. ఉద్యానవనాన్ని హెర్బ్ గార్డెన్, ఫెర్న్‌గల్లీ, గ్లాస్‌హౌస్, వాటర్ కన్జర్వేషన్ గార్డెన్‌తో సహా వివిధ జోన్‌లుగా విభజించారు. యూరోపియన్ పెయింటింగ్‌లు, శిల్పాల నుండి ఆదివాసీ కళాఖండాలు, సమకాలీన వస్త్రాలు, సిరామిక్స్, మెటల్‌వర్క్‌ల వరకు ప్రదర్శనలో ఉన్న 70,000 కంటే ఎక్కువ కళాకృతులతో నేషనల్ గ్యాలరీ ఆఫ్ విక్టోరియాను ప్రతీ కళాప్రేమికుడు విధిగా సందర్శిస్తాడు. ఫిలిప్ దీవిలో చిన్న పెంగ్విన్ కాలనీ ఉంది. లూనా పార్క్, సెయింట్ కిల్డాస్ బీచ్ మొదలైనవి పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తాయి.



## గ్రేట్ బారియర్ రీఫ్ మెరైన్ పార్క్

ఆస్ట్రేలియాలో సందర్శించదగిన ముఖ్యమైన ప్రదేశం గ్రేట్ బారియర్ రీఫ్.

ఇది ప్రపంచంలోనే అతి పెద్ద పగడపు దిబ్బగా పేరొందింది. మెరైన్ పార్క్ క్వీన్స్‌లాండ్ రాష్ట్రంతో పాటు 2,300 కిలోమీటర్ల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. ఇది ప్రపంచంలోని సహజ అద్భుతాలలో ఒకటి. 400 జాతుల పగడాలు, వేలాది రకాల చేపలు, సముద్ర పాములు, సముద్ర తాబేళ్లు, తిమింగలాలకు ఆవాసం. ఆస్ట్రేలియా ఈశాన్య తీర ప్రాంతంలో 2,300 కి.మీ. మేర గ్రేట్ బారియర్ రీఫ్ విస్తరించి ఉంది. ఈ ప్రాంతంలో వందకు పైగా అందాల ద్వీపాలు, 600 ఖండాంతర ద్వీపాలు, 3000లకు పైగా పగడపు దిబ్బలు, 150 సముద్రతీర మడ ద్వీపాలు కనువిందు చేస్తాయి. ఇంద్రధనస్సు రంగులతో ఉన్న పగడపు దిబ్బలు నయనానందం చేస్తాయి.

డాల్ఫిన్స్‌లతో ఈత కొట్టడం, డైవింగ్ చేయడం ఇక్కడ ప్రత్యేకత. 1981లో దీనికి ప్రపంచ వారసత్వ సంపద గుర్తింపు లభించింది.

ప్రస్తుతం గ్రేట్ బారియర్ రీఫ్ ప్రమాదపు అంచున ఉందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. గత కొన్నేళ్లుగా బ్లీచింగ్ కార్యకలాపాలు, వాతావరణ కాలుష్యం కారణంగా గ్రేట్ బారియర్ రీఫ్‌కు తీవ్ర నష్టం ఏర్పడుతోంది. శిలాజ ఇంధనాలు మళ్లించడం వల్ల వాతావరణ కాలుష్యం పెరుగుతుందని శాస్త్రవేత్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. భూతాపం కారణంగా సముద్ర ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల దీనిపై తీవ్ర దుష్ప్రభావం పడుతుందని శాస్త్రవేత్తలు అంటున్నారు. ప్రకృతి సంపదను కాపాడుకోవడానికి ఆస్ట్రేలియా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని పర్యావరణవేత్తలు ఆందోళన చెందుతున్నారు. దీన్ని వారసత్వ సంపదల జాబితాల నుంచి తొలగించాలని యునెస్కో భావిస్తోంది. యునెస్కో నిర్ణయాన్ని విన్న ఆస్ట్రేలియా ఆశ్చర్యం వ్యక్తపరిచింది. ప్రపంచంలో సుమారు 83 వారసత్వ సంపదలు వాతావరణ కాలుష్య ముప్పును ఎదుర్కొంటుంటే కేవలం గ్రేట్ బారియర్ రీఫ్ హోదాను మాత్రమే మారుస్తామనడం సబబు కాదని వాదిస్తుంది. ఈ విషయమై ఇంకా వాద ప్రతివాదనలు జరుగుతున్నాయి. ఏది ఏమైనా గ్రేట్ బారియర్ రీఫ్‌ను కాపాడుకోవలసిన అవసరం ఉంది.

విట్సండేలోని వైట్‌హావెన్ బీచ్ ఆస్ట్రేలియాలోని అత్యంత ప్రసిద్ధ బీచ్‌లలో ఒకటి. ఇక్కడ ఏడు కిలోమీటర్ల మేర మెరిసే తెల్లటి ఇసుక, మెత్తగా పాడిన నీలి సముద్రం గ్రేట్ బారియర్ రీఫ్‌లో



చూడదగిన స్థలాలు.

## మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియం

మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియంలో మైనంతో చేసిన పలు బొమ్మలు ఎంతో ఆకర్షణీయంగా ఉన్నాయి. ఇక్కడ దేశ, విదేశీ నాయకులు, సినిమా ప్రముఖులు, క్రీడాప్రముఖులు, సంగీత, ఇతర రంగాల ప్రముఖుల బొమ్మలు మైనంతో చేసి పర్యాటకుల సందర్శనార్థం ఉంచారు. మన జాతిపిత మహాత్మాగాంధీ, బిగ్‌బీ అమితాబ్‌బచ్చన్, బాలీవుడ్ తారలు ఐశ్వర్యారాయ్, షారుఖ్‌ఖాన్, ప్రియాంకచోప్రా, క్రికెట్ లెజెండ్ సచిన్ టెండూల్కర్ విగ్రహాలు ఇక్కడ ప్రత్యేక ఆకర్షణ. కొందరు సెలబ్రిటీస్ వారి మైనం బొమ్మ పక్కనే నిలబడి ఫొటోలు



తీయించుకున్న సందర్భాలున్నాయి. ఏ బొమ్మ చూసినా ఆ మనిషి మన ఎదురుగా నిలుచున్నట్లే అనిపిస్తుంది. ఒకదాన్ని మించి మరొకటి జీవకళ ఉట్టిపడుతూ వీక్షకుల్ని మంత్రముగ్ధుల్ని చేస్తాయి.

భారతీయ పర్యాటకులు గాంధీజీతో పాటు మరికొంతమంది ప్రముఖుల మైనం బొమ్మల పక్కన నిలబడి ఫొటోలు దిగుతారు.

## బీచ్ అందాలు

ఇక్కడ చూడదగిన వాటిలో బోండిబీచ్ ప్రధానమైనది. సిడ్నీకి తూర్పు శివారులో సిటీ నుంచి 7 కి.మీ. దూరంలో బోండిబీచ్ ఉంది. ప్రపంచంలోని ప్రధాన బీచ్‌లలో బోండిబీచ్ ఒకటి. ఆస్ట్రేలియాలో ఎక్కువ మంది సందర్శించే పర్యాటక కేంద్రాలలో ఇదీ ఒకటి. బీచ్‌లోకి అడుగు పెట్టగానే అక్కడి అందాలు, ప్రకృతి రమణీయతలు పర్యాటకుల్ని ఎంతగానో ఆకట్టుకుంటాయి. నీలి సాగర జలాలు, పిండిలాంటి మెత్తని ఇసుక, సర్ఫింగ్ క్రీడాభ్యాసాలు, జనం మధ్య సంచరించే అందమైన పక్షులు మొదలైన ప్రత్యేకతలతో ఈ బీచ్ పర్యాటకులకు కనువిందు చేస్తుంది. ❑



## సరదా రచనలకు ఆహ్వానం

జోక్స్, ప్యారడీ పాటలు, సరదా అనుభవాలు, పంచ్ డైలాగులు వగైరాలు
పంపితే పరిశీలించి, బాగుంటే ప్రచురిస్తాం. దయచేసి కాపీ రచనలు పంపకండి.
మీ రచనలు పంపించవలసిన చిరునామా: నవ్వుల్.. రువ్వుల్, ఎడిటర్, ఆదివారం వార్త, నం.396,
లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080. sunmagvaartha@gmail.com



# వారఫలం

పాలకుర్తి సంతోష శర్మ, స్మార్త పండితులు
సుబ్బరాజు టవర్స్, 11-10-30/308
విజయపురి కాలనీ, కొత్తపేట
హైదరాబాద్. ఫోన్: 9494608133

## మేషం



ఆత్మస్థైర్యంతో ముఖ్యమైన పనులు పూర్తి చేస్తారు. ఖర్చులు అధికం. సంతానాభివృద్ధి సంతృప్తికరంగా ఉంటుంది. పేరు ప్రతిష్ఠలు లభిస్తాయి. వృత్తి రంగాల్లో వున్నవారికి ఆర్థికంగా బాగుంటుంది. ఉద్యోగులకు స్థానచలనం/ పదోన్నతి సూచనలున్నాయి. శారీరక, మానసిక ఒత్తిడికి లోనవుతారు. నూతన వాహన యోగం. ప్రయాణం లాభిస్తుంది.

## వృషభం



రుణాలు తీర్చడంలో ఇబ్బందులుంటాయి. సామాజిక సంఘర్షణకు లోనవుతారు. క్రయ-విక్రయాలు లాభదాయకం. ఉత్సాహంగా గడుస్తుంది. ఖర్చులు అధికంగా ఉంటాయి. భాగస్వామ్య వ్యాపారులు సామరస్యంతో సమస్యలు పరిష్కరించుకుంటారు. వృత్తి విద్యాకోర్సులు అభ్యసించిన వారికి ఆర్థికంగా బాగుంటుంది. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు.

## మిథునం



సంతోషంగా గడుస్తుంది. ఉద్యోగులు మానసిక సంఘర్షణకు లోనవుతారు. పేరు ప్రతిష్ఠలు లభిస్తాయి. ప్రయాణంలో జాగ్రత్తలు పాటించండి. కుటుంబ సమస్యలు పరిష్కారమవుతాయి. శుభకార్యాల్లో పాల్గొంటారు. అకారణంగా ఆందోళన చెందుతారు. ఆహార, ఆరోగ్య సలహాలు-సూచనలు పాటించండి. చిరకాల కోరిక తీరుతుంది. ఉద్యోగులకు పదోన్నతి.

## కర్కాటం



ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తారు. దేశాంతర ప్రయాణ సూచనలున్నాయి. ప్రత్యర్థులు సమస్యలు సృష్టించినా మనోధైర్యంతో ఎదుర్కొంటారు. కుటుంబంలో మన స్పర్థలకు ఆస్కారం. ఓర్పుగా వ్యవహరిస్తే మరిన్ని విజయాలు మీ సొంతమవుతాయి. స్త్రీలు అన్ని వ్యవహారాల్లో ఆచి తూచి వ్యవహరించడం చెప్పదగిన సూచన. కళాకారులకు సన్మానం.

## సింహం



విందు-వినోదాల్లో పాల్గొంటారు. బంధు, మిత్రులను కలుసుకుంటారు. దూర ప్రాంత ప్రయాణ సూచనలున్నాయి. అన్ని వ్యవహారాల్లో విజయం సాధిస్తారు. క్రయ-విక్రయాలు సామాన్యంగా ఉంటాయి. మీ శక్తి సామర్థ్యాలకు తగిన గుర్తింపు లభిస్తుంది. స్త్రీలకు శుభ యోగం. నిరుద్యోగులకు ఎదురు చూస్తున్న ఉద్యోగం లభిస్తుంది.

## కన్య



ఆలోచనల్లో స్థిరత్వం లోపిస్తుంది. ప్రముఖులను సందర్శిస్తారు. అన్ని వ్యవహారాల్లో మీదే పై చేయిగా ఉంటుంది. విద్యార్థులు పరీక్షల్లో అనూహ్య విజయం సాధిస్తారు. కుటుంబ సమస్యలు తీరుతాయి. విశేష వస్తువులు సమకూర్చుకుంటారు. కవులు, కళాకారులు, క్రీడాకారులకు సన్మాన యోగం. చిరు వ్యాపారులకు లాభదాయకం. చర్చలు ఫలిస్తాయి.

## తుల



విశేష వస్తువులు లభిస్తాయి. సామాన్య ధన లాభం. కుటుంబ సమస్యలు తీరి ప్రశాంతత లభిస్తుంది. చిరకాల కోరిక తీర్చుకుంటారు. విద్యార్థులకు శుభ యోగం. సాహితీ మిత్రులను కలుసుకుంటారు. ఆకస్మిక సంఘటనలు జరిగినా ధైర్యంతో ఎదుర్కొంటారు. ఉద్యోగులకు ఉన్నతాధికారం లభిస్తుంది. అకారణంగా ఆందోళన చెందుతారు. బంధు, మిత్రులను కలుసుకుంటారు. శారీరక, మానసిక వత్తిడి ఉంటుంది.

## వృశ్చికం



రుణాలు తీర్చడంలో ఇబ్బందులుంటాయి. స్త్రీలకు శుభ యోగం. కళాకారులకు సన్మాన యోగం. ఆకస్మిక ప్రయాణం చేయాల్సి వస్తుంది. సంతానాభివృద్ధి సంతోషం కలిగిస్తుంది. క్రయ-విక్రయాలు సామాన్యంగా ఉంటాయి. దూర ప్రాంత ప్రయాణ సూచనలున్నాయి. వృథా ఖర్చులను నియంత్రిస్తారు. కుటుంబంలో ఐకమత్యం ఏర్పడుతుంది. వృద్ధుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తారు. పాత బాకీలు వసూలవుతాయి.

## ధనుస్సు



శుభ కార్యాల్లో పాల్గొంటారు. ప్రముఖులను కలుసుకుంటారు. శారీరక, మానసిక శ్రమ ఉంటుంది. వృత్తి వ్యాపారస్తులకు లాభాలు ఆశించిన మేరకు ఉండకపోవచ్చు. వృద్ధుల ఆరోగ్యం మెరుగవుతుంది. వృథా కాలక్షేపం చేస్తారు. కీర్తి ప్రతిష్ఠలు లభిస్తాయి. చాకచక్యంతో వ్యవహరించి ముఖ్యమైన పనులు పూర్తి చేసుకుంటారు. ధార్మిక చింతన అలవడుతుంది. మొండి బకాయిలు వసూలవుతాయి.

## మకరం



ప్రత్యర్థుల వ్యూహాలను చాకచక్యంతో ఎదుర్కొంటారు. అనూహ్యంగా మొండి బాకీలు వసూలవుతాయి. ఆలోచనల్లో స్థిరత్వం ఏర్పడుతుంది. దుష్ట సాంగత్యం మంచిది కాదని స్వీయానుభవంతో తెలుసుకుంటారు. విలువైన వస్తువులు లభిస్తాయి. చిరకాల కోరిక వారాంతంలో తీర్చుకుంటారు. ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయడం ఏమాత్రం తగదు. ఉద్యోగాభివృద్ధి బాగుంటుంది. బాల్య మిత్రులను కలుసుకుంటారు.

## కుంభం



సంతానాభివృద్ధి సంతృప్తినిస్తుంది. రుణాలు తీర్చి ఊరట పొందుతారు. ఉద్యోగులకు పదోన్నతి/స్థానచలన సూచనలున్నాయి. క్రయ-విక్రయాలు ఆశించిన రీతిలో ఉండకపోవచ్చు. ముఖ్యమైన పనులు పూర్తి చేస్తారు. దుర్వ్యసనాలకు దూరంగా వుండాలని దృఢ నిశ్చయం చేసుకుంటారు. వృత్తి విద్యలు అభ్యసించినవారికి ఉద్యోగావకాశాలు అధికం.

## మీనం



ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. తీర్థ యాత్రలు చేస్తారు. సంయమనంతో వ్యవహరించడం అన్నివిధాలా మంచిది. వృత్తి రంగాల్లో వున్నవారికి బాగుంటుంది. రుణాలు తీర్చి మానసిక ప్రశాంతత పొందుతారు. వృత్తి విద్యాకోర్సులు అభ్యసించిన వారికి ఉన్నతోద్యోగం లభిస్తుంది. అనుకున్న పనులు సకాలంలో పూర్తవుతాయి. ఉద్యోగులకు అదనపు ఆదాయ మార్గాలు లభిస్తాయి. చర్చలు వాయిదా.

**వాస్తువార్త**
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్
సెల్స్: 9885446501/9885449458

# మెట్ల నిర్మాణం ఎలా ఉండాలి?

**ఇంటి** లోపలగానీ, ఇంటి బయట ప్రహరీలోగానీ మేడపైకి మెట్ల నిర్మాణం గావించేప్పుడు మెట్లు తూర్పుకుగానీ, ఉత్తరానికిగానీ వాలుగా వచ్చేట్లు వుండాలి. అంటే మనం మెట్లు ఎక్కడం ప్రారంభించినప్పుడు మన మొహం పడమరకుగానీ, దక్షిణానికిగానీ వుండాలి.

### ఒక వరుస మెట్లు

ఒకే వరుస మెట్లు వేయాల్సి వస్తే తూర్పు నుండి పడమరకు ఎక్కే విధంగా లేదా ఉత్తరం నుండి దక్షిణానికి ఎక్కే విధంగా వేయాలి.

### రెండు వరుసల మెట్లు

రెండు వరుసల మెట్లు నిర్మించవలసి వస్తే మొదటి వరుస తూర్పు నుండి పడమరకు వెళ్లే విధంగా వుండి ఆ తరువాత ఎటువైపుకయినా తిరిగి పడమర నుండి తూర్పుకు ఎక్కే విధంగా ఉండాలి. లేదా మొదటి వరుస ఉత్తరం నుండి దక్షిణానికి ఎక్కి, ఆ తరువాత ఎటువైపుకయినా తిరిగి దక్షిణం నుండి ఉత్తరానికి ఎక్కే విధంగా ఉండాలి.

### 'ఎల్' ఆకారంలో మెట్లు

ఆంగ్ల అక్షరం 'ఎల్' స్వరూపంలో మెట్ల నిర్మాణం గావించవలసి వచ్చినప్పుడు కూడా మొదట తూర్పు నుండి పశ్చిమానికిగానీ, ఉత్తరం నుండి దక్షిణానికిగానీ ఎక్కి, ఆ తరువాత ఎటువైపుకయినా తిరిగే విధంగా మెట్లు నిర్మించుకోవాలి.

ఒక్క వరుస మెట్లు గృహానికి వెలుపల ప్రహరీలోపల ఒక్క వరుసమెట్లు నిర్మించాలనుకుంటే ఈశాన్య, ఆగ్నేయ, వాయువ్య, నైరుతి భాగాల్లో నిర్మించుకోవచ్చు.

ఈశాన్యంలో మెట్ల నిర్మాణం వాస్తురీత్యా నిషేధించబడటం సత్యమేగానీ, ఇంటికి బయట ఇంటితూర్పు ఈశాన్యం, ఉత్తర ఈశాన్యం గోడలకు ఆనుకొని ఎటైనా ఒకవైపు మాత్రమే నేరుగా మెట్ల నిర్మాణం గావించుకోవచ్చు. ఆ మెట్లు ఇంటి ఈశాన్య ప్రహరీగోడలకు తగలకుండా జాగ్రత్త పడాలి. అలా తగలడం వలన ఇంటి ఆవరణలోని ఈశాన్య మూల మెట్ల మూలంగా బరువును సంతరించుకుని దుష్ఫలితాలు కలుగుతాయి. గృహానికి దక్షిణ, పశ్చిమ భాగాల్లోని ప్రహరీ గోడలకున్న మధ్య దూరం కంటే ఉత్తర, తూర్పు భాగాల్లోని ప్రహరీ గోడలకున్న దూరం ఎక్కువగా వుండాలన్న విషయం తెలిసిందే. ఆ ఎక్కువ దూరం మెట్లకు కోసం కేటాయించిన స్థలం తర్వాత మిగిలిన దూరం హెచ్చుగా ఉండాలనే విషయం గుర్తుంచుకోవాలి. దక్షిణంలో మూడు అడుగుల ఖాళీ స్థలం వదిలి, ఉత్తరంలో ఐదడుగుల ఖాళీ స్థలం వదలి.. వదిలిన ఆ ఐదడుగుల ఖాళీ స్థలంలో మూడడుగుల మెట్లు వేస్తే మిగతా దూరం రెండడుగులే. అలా దక్షిణంలో వదిలిన స్థలం కంటే ఉత్తరంలో వదిలిన స్థలం తక్కువకు కుదించుకుపోతున్నది. అందువల్ల ముందే ఆలోచించుకుని మెట్ల నిర్మాణం కోసం స్థలం కేటాయించిన తరువాత మిగిలే స్థలం దక్షిణం,



పశ్చిమాల కంటే ఎక్కువ ఉండే విధంగా ప్లాన్ చేసుకోవాలి.

తూర్పు ఈశాన్యంలో ఒక వరుస మెట్లు ఇంటి తూర్పు గోడనానుకుని ఉత్తరం నుండి దక్షిణానికి మెట్లు కట్టినప్పుడు ఆ మెట్ల నిర్మాణం బాల్కనీలోకి చేరేలా బాల్కనీ తప్పకుండా వేయాలి. బాల్కనీలోకి నడిచి ఇంటిలోకి మధ్య భాగంలో నుండిగానీ, ఉచ్చస్థానంలో నుండిగానీ ప్రవేశించేలా తలుపు వుండాలి. మెట్లకు తూర్పు వైపున వదిలిన ఖాళీస్థలం ఇంటికి పశ్చిమాన వదిలిన ఖాళీస్థలం కంటే హెచ్చుగా వుండటం గమనించవచ్చు.

ఉత్తర ఈశాన్యంలో ఒక వరుస మెట్లు ఇంటి ఉత్తర గోడనానుకుని ఉత్తర ఈశాన్యంలో తూర్పు నుండి పశ్చిమానికి మెట్ల నిర్మాణం చేసినప్పుడు మెట్లు బాల్కనీలోకి చేరేలా బాల్కనీ తప్పనిసరిగా నిర్మించాలి. మెట్లు ఎక్కిన తరువాత బాల్కనీలోకి చేరి ఇంట్లోని మధ్య భాగంలో నుండిగానీ, ఉచ్చస్థానంలో నుండిగానీ ప్రవేశించేలా తలుపును ఏర్పాటు చేసుకోవాలి. మెట్లకు ఉత్తరాన వదిలిన స్థలం, ఇంటికి దక్షిణాన వదిలిన స్థలంకంటే హెచ్చుగా ఉండటం అవసరం.

### ఆగ్నేయంలో ఒక్క వరుస మెట్లు

ఒక వరుస మెట్లు ఆగ్నేయంలో వేయవలసి వస్తే ఇంటికి దక్షిణ ఆగ్నేయంలో దక్షిణ గోడను ఆనుకుని తూర్పు నుండి పశ్చిమానికి ఎక్కేలా మెట్ల నిర్మాణం చేసుకోవాలి. మెట్లు బాల్కనీలోకి తీసుకువెళ్లేలా బాల్కనీ నిర్మాణం దక్షిణంలో చేసుకోవలసి వస్తుంది. కాబట్టి విధిగా ఉత్తరం వైపున కూడా బాల్కనీ కాస్త ఎక్కువ వెడల్పుతో నిర్మించుకోవాల్సి ఉంటుంది. పశ్చిమ తూర్పులలో బయట కూడా బాల్కనీని పొడిగించుకో వచ్చు. మెట్లు ఎక్కి బాల్కనీలోకి వెళ్లాక ఇంట్లో మధ్య స్థానం నుండిగానీ, ఉచ్చస్థానం నుండిగానీ ప్రవేశించేందుకు అనువుగా తలుపు ఏర్పాటు చేసుకోవాలి. ఒంటి వరుస మెట్లు తూర్పు ఆగ్నేయం లో కట్టుకుంటే గృహంలోకి ప్రవేశించ టానికి ఆ మెట్లను పశ్చిమానికి తిప్పి దక్షిణ ఆగ్నేయ ద్వారం ఉపయోగిం చవలసి వస్తుంది. అప్పుడు అది ఒంటి వరుస మెట్లుగాక 'ఎల్' ఆకారపు మెట్లు అవుతాయి. నేరుగా కట్టిన మెట్లు తూర్పు ఆగ్నేయంలో ఆగిపోతే ఆ ఇంట్లో కి వెళ్లటానికి ఆగ్నేయ ద్వారా మాత్రమే శరణ్యమవుతుంది. అది నీచస్థానం నడక అవుతుంది. కాబట్టి తూర్పు ఆగ్నేయంలో ఒంటివరుస మెట్ల నిర్మాణం ఆలోచనను మానుకోవడం మంచిది.

### వాయువ్యంలో ఒక వరుసమెట్లు

వాయువ్యంలో మెట్ల నిర్మాణం గావించవలసి వస్తే (ఒక వరస మెట్లు) పశ్చిమ వాయువ్యంలో ఉత్తరం నుండి దక్షిణానికి ఎక్కేలా నిర్మాణం జరపవలసి ఉంటుంది.

(మిగతా వచ్చేవారం)

**సింగిల్ పేజీ కథ**

# మాష్టారు

ఆంగ్లం: రస్కిన్‌బాండ్
అనువాదం: టి.లలితప్రసాద్

అమృతసర్ ఎక్స్‌ప్రెస్ కోసం ఎదురు చూస్తూ ప్లాట్‌ఫామ్ మీద అటూ ఇటూ తిరుగుతున్నాను. అప్పుడే కుషాల్‌గారిని చూశాను, చేతికి బేడీలతో పోలీస్ పక్కన ఉన్నారు. దగ్గరగా వెళ్లి ముఖాన్ని పరిశీలనగా చూశాను... ఆయనే! మా స్కూల్లో హిందీ మాష్టారు. ఆయనా నన్ను పరీక్షగా చూశారు. నేను ఫలానా అని గుర్తుకు వచ్చినట్టుంది.. కళ్ల ఆనందంతో మెరిసాయి. "గుడ్... గుడ్ ఈవినింగ్ సర్" అని తడబాటుతో పలకరించాను. కుషాల్ గారి ముఖం ఆనందంతో విప్పారింది. "మళ్లీ నిన్ను చూసినందుకు సంతోషంగా ఉందోయ్!" అన్నారు. ఆయన పాత కోటు నుంచి అదే సుగంధ వాసన. క్లాస్ రూమ్‌లో అటూ ఇటూ తిరుగుతూ నా దగ్గరకి వచ్చి నా హిందీ-ఇంగ్లీష్ అనువాదాన్ని పరిశీలించడంలో వంగి చూసినప్పుడు వచ్చే వాసన!

దేశ విభజన తర్వాత కొద్ది కాలానికే 1948లో మా స్కూల్లో హిందీ మాష్టారుగా చేరారు కుషాల్‌జీ. అప్పటివరకూ స్కూల్లో హిందీ టీచర్ ఎవరూ లేరు. మాకు ఉర్దూ, ఫ్రెంచ్ నేర్పేవారు. అప్పుడు ప్రభుత్వాదేశం వచ్చింది, పాఠశాలల్లో హిందీ తప్పనిసరిగా నేర్పాలని. మళ్లీ ఇన్నాళ్లకి ఆయన ఇలా ప్రత్యక్షమయ్యారు. ఇంతలో రైలు రానే వచ్చింది. పోలీసు ఆయన్ను థర్డ్ క్లాస్ కంపార్ట్‌మెంట్‌లోకి ఎక్కించాడు. నేను వాళ్ల వెనక ఉన్నందువల్ల సులువుగా ఎక్కాను తీరా లోపలికి వెళ్లాక ఇద్దరం ఎదురెదురు సీట్లలోనే కూచున్నాం. బేడీలతో ఉన్నందుకు, చుట్టూరా అందరూ చూస్తున్నందుకూ ఆయన కంటే పోలీసు తెగ ఇబ్బందిపడటం గమనించాను. మా ఫిరోజ్‌పూర్ ఇంటివాళ్లు ఇచ్చిన పరోటాల్లో ఒకటి తీసుకోమనగానే ఆయన ఆతృతగా తీసుకున్నారు. పోలీస్ మాత్రం వద్దన్నాడు, డ్యూటీలో అలా తినరట.

"మిమ్మల్ని ఎందుకు అరెస్టు చేశారు?" అడిగాను. "త్వరలోనే బయటపడతాలే!" అన్నారు చాలా మామూలుగా.

"ఇంతకీ మీరేం చేశారు?""ఘోరమేమీ కాదు, సిగ్గుపడాల్సింది ఏమీ లేదు. సోక్రటీస్ అంతటివాడూ ఇతరుల వల్ల చట్టంముందు తలొంచుకున్నాడు".

"పోనీ మీ విద్యార్థి ఎవరైనా ఫిర్యాదు చేశాడా?" "ఎవరైనా ఎందుకు ఫిర్యాదు చేస్తారు? అంతా లబ్ది పొందినవారే" సిగ్గుతో తలొంచుకున్నారు "ఇది దొంగ సర్టిఫికెట్ వ్యవహారం" అన్నారాయన మెల్లగా.

"ఏమిటీ, మీ సర్టిఫికెట్లా?!" అని గట్టిగానే అన్నాను.

"అబ్బే, నావి కాదు, వాటిలో పొరపాటు లేదు. వాటిని 1944లో లాహోర్‌లో ప్రింట్ చేయించాను". "వయసుతో పాటు గౌరవ మర్యాదలూ లభిస్తాయి.. మరి ఎవరివి?" అడిగాను.

"పేద విద్యార్థులకని ఇన్నాళ్లూ ఇచ్చానే ఆ మెట్రిక్యులేషన్ సర్టిఫికెట్లు అవి. ఆ వెర్రివెధవలు స్వయంగా పాస్ కాలేకపోవడంతో వాళ్లని ఒడ్డున పడేద్దామని ఇస్తూండేవాణ్ణి". "మీ సర్టిఫికెట్లే వాళ్లకీ ఇచ్చారా?" "అవును.. వాటిలో అనేక ప్రింటింగ్ తప్పులు లేకుంటే వీళ్ల తెలివిమంతులయ్యేవాళ్లే. అయినా ఈ రోజుల్లో మంచి ప్రింటింగ్ ప్రెస్ ఎక్కడ ఏడ్చింది? ఇది ప్రజాసేవ అబ్బాయ్. ఒక పిల్లాడిని తికమకపెట్టే పరీక్ష నుంచి తప్పించి జీవితం ప్రసాదించాను. నా సర్టిఫికెట్లు ఎవ్వరికీ ఇవ్వలేదు సుమా! వాళ్లు ఒకటి రెండు సార్లు తప్పించినందువల్ల అవి నా దగ్గరకు వచ్చాయి.

"మీరు అందుకు ఎంతో కొంత చార్జ్ చేసి ఉంటారుగా!"

"అదీ వాళ్లు ఇవ్వగలిగితేనే. వాళ్లు ఎంత ఇస్తే అంత తీసుకున్నా. నాకు డబ్బుఆశ లేదు"

అదీ నిజమే. కిటికీలోంచి అవతలకి చూశాను. మోగా గ్రామ పైరుగాలి చల్లగా తగులుతోంది. నాకు నా స్కూలు జ్ఞాపకాలు ముసిరాయి. ముఖ్యంగా అర్ధ సంవత్సర పరీక్షలు, హిందీ పరీక్ష. నిజానికి నాకు అక్షరంముక్క రాదు. ప్రశ్నాపత్రాన్ని అలా చూస్తుండిపోయాను. అందరూ రాస్తున్నారు. మాష్టారు అందరినీ చూస్తూ నా దగ్గరికి వచ్చారు. కోటు ఘాటు వాసన ఇబ్బంది పెట్టింది. "ఏవీ, ఇంకా మొదలే పెట్టలేదు, కానీ.. కానీ.." అన్నారు.

"మిమ్మల్ని ఎందుకు అరెస్టు చేశారు?" అడిగాను.
"త్వరలోనే బయటపడతాలే!" అన్నారు చాలా మామూలుగా.
"ఇంతకీ మీరేం చేశారు?""ఘోరమేమీ కాదు, సిగ్గుపడాల్సింది ఏమీ లేదు. సోక్రటీస్ అంతటివాడూ ఇతరుల వల్ల చట్టంముందు తలొంచుకున్నాడు" అన్నాడు.

"చాలా కష్టంగా ఉంది.. రాయలేను సర్" అన్నాను.

"ఏం ఫరవాలేదు. కాపీ కొట్టు.. రాసేయ్.." అన్నారు మీదకి వొంగి మెల్లగా.

నేను పరీక్షహాల్లో టైమ్‌పాస్ కోసం పేపర్ అంతా మక్కికి మక్కీ కాపీ కొట్టాను. పదిహేను రోజుల తర్వాత వచ్చిన ఫలితాల్లో నేను హిందీలోనూ పాస్ అవడం ఆశ్చర్యమనిపించింది.

పోలీస్ అవతలకి వెళ్లాడు.

మాష్టారు ఒక్కరే ఉండడం గమనించి "అవును సార్, అప్పుడు ఎలా పాస్ అయ్యాను? అనువాదం కూడా చేయలేదే?" అడిగాను భయం భయంగా.

"అందుకే పాస్ మార్కులతో దాటావు. నీ చేతిరాత చాలా బాగుంటుంది. నువ్వు నిజంగా హిందీ నేర్చుకుంటే నీ హిందీ రైటింగ్ మరింత బాగుంటుంది" అన్నారాయన.


పాత జ్ఞాపకం వచ్చి ఆయన మీద గౌరవం పెరిగింది. ప్రస్తుతం ఆయన స్థితికి జాలేసింది. కాస్తంత దగ్గరగా వొంగి "సర్, మీ శిక్ష నుంచి బయటికి వచ్చిన తర్వాత ఒక్క ఫోన్ చేయండి. మీరు ఢిల్లీలోగానీ, ఫిరోజ్‌పూర్‌లోగానీ ఉంటే మీ దగ్గర ట్యూషన్‌కి వస్తాను" అని కోరాను.

"నీకు హిందీ నేర్వాలా?" గట్టిగా ఆశ్చర్యం వ్యక్తం చేశారు. "ఒరి పిచ్చోడా, అసలు నాకు హిందీ వచ్చన్న ఆలోచన నీకెలా వచ్చింది?"

"సర్, హిందీ కాకుంటే మరి ఇన్నాళ్లూ స్కూల్లో మీరు నేర్పిందేమిటి?"

"పంజాబీ!" అని గట్టిగా అరిచినట్టు చెప్పారు. కంపార్ట్‌మెంట్‌లో అంతా ఒక్కసారిగా ఏదో అయినట్టు భయంతో లేచారు. "నేను ఇన్నాళ్లూ నేర్పింది పంజాబీనే. మీకు హిందీ, పంజాబీల మధ్య తేడా తెలియదు కదా!" అని గట్టి నవ్వేశారు.

# ఈ వారం కా‘ర్టూన్స్’


మీరిద్దరూ ఒక ఆర్నెల్లు స్నేహం చేసి.. ఆ తర్వాత రండి..!!
ఏంటమ్మా... వీడు ఇంట్లో కూడా నిద్రపోతాడా..?!
గుర్..ర్..
వెల్కం సర్..! రూంలో టీవీ ఉండదు... న్యూస్ పేపర్ ఇవ్వం... మొబైల్ సిగ్నల్ ఉండదు.. వైఫై అస్సలుండదు... హ్యాపీ గా ఉండండి..!!
CHECK-IN
రిసెప్షన్



మెక్స్‌కాల్టిటాన్ అనే ఈ ఐలాండ్ విలేజ్ మెక్సికోలో ఉంది. ఇది రియో సాన్ పెద్రో అనే నది మధ్యలో కృత్రిమంగా ఏర్పాటు చేసుకున్న దీవి. పన్నెండవ శతాబ్దంలో మెక్సికన్లు నిర్మించుకున్న ఈ ఊరు ఇప్పుడు ఓ పర్యాటక ప్రదేశంగా మారిపోయింది.







